రేపు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

ఏలూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 8న జరుగనున్న జాతీయ ఉపకార వేతన (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 12 కేంద్రాల్లో జరుగుతుందని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 2,788 మంది బాలబాలికలు దరఖాస్తు చేసుకున్నారని, పరీక్ష ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంటముందుగానే హాల్‌టిక్కెట్‌తో చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించబోమన్నారు. అటెండెన్స్ షీట్‌లో సంతకం చేసేముందు అభ్యర్థికి సంబంధించిన వివరాలను సమగ్రంగా పరిశీలించుకోవాలని, ఏమైనా తప్పులుంటే ఆ విషయాన్ని ఇన్విజిలేటర్‌కు తెలపాలని కోరారు. హాల్‌టిక్కెట్‌పై అభ్యర్థి ప్రింటెడ్ ఫొటో లేకపోయినా, తప్పుగా ఫొటో ముద్రితమైవున్నా ముందుగానే సరైన ఫొటోను అంటించి సంబంధిత స్కూలు హెచ్‌ఎంతో సంతకం చేయించడంతో పాటు, మరో ఫొటోను పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్‌కు అందజేయాలన్నారు. పరీక్ష నిర్వహణకు నియమితులైన చీఫ్ సూపరింటెం డెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు, బోధనేతర సిబ్బందికి శుక్రవారం ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి : ఎస్పీ

ఏలూరు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సిబ్బంది సమస్యలను త్వరితగతిన పరిష్కరించి చర్యలు తీసుకుంటానని ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోలీస్ సంక్షేమ దివాస్ కార్యక్రమంలో ఎస్పీ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సిబ్బంది నుంచి వినతులను స్వీకరించారు. వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



8



కెమెరాలకు ఏమైంది?

- పట్టణాల్లో పనిచేయని సీసీ కెమెరాలు
- అన్నిచోట్లా అలంకారప్రాయం
- భీమవరంలో సగానికి పైగా మరమ్మతులే
- రెచ్చిపోతున్న నేరస్థులు

8



ముచ్చటగా.. మూడోసారి!

నీటి సంఘాల ఎన్నికలకు ముహూర్తం ఎప్పుడు పెట్టారోగాని సవ్యంగా గట్టెక్కడం లేదు. ఇప్పటికే రెండుసార్లు ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సమన్వయ లోపమే దీనికి ప్రధాన కారణంగా నిలిచింది. ఆయా సంఘాల ఓటర్ల జాబితాల్లో ఇప్పటికీ స్పష్టత రాలేదు. ఈనేపథ్యంలోనే తాజాగా ముచ్చటగా మూడోసారి ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమవుతున్నారు.

14 నుంచి నీటి సంఘాల ఎన్నికలకు సన్నాహాలు

- రెండుసార్లు వాయిదా పడ్డా అడ్రస్సులేని ఓటర్ల జాబితా
- రెవెన్యూ, జల వనరుల శాఖల మధ్య సమన్వయలోపం
- ఉన్నత స్థాయిలోను సమీక్ష కరువు
- క్షేత్రస్థాయిలో పొంతన కుదరని పార్టీలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

రెండు నెలల క్రితమే సాగునీటి సంఘాల ఎన్నికలకు వీలుగా ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది. అక్టోబరులో నోటిఫికేషన్ ఇచ్చి దశల వారీగా ఎన్నికలు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసింది. నీటి సంఘాల గుర్తింపు దగ్గర నుంచి డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీల ఎన్నికల వరకు అంతా సవ్యంగా సాగాలంటే ముందస్తుగా ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా సభ్యులు అవసరం. సరిగ్గా ఇక్కడే చిక్కొచ్చిపడింది. ఏ మండలానికి ఆ మండలం తహసీల్దార్లు, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో ఈ వ్యవహారాన్ని చక్కబెట్టాల్సిందిగా జల వనరుల శాఖ మంత్రి రామానాయుడు ఆదేశాలు ఇచ్చారు. అక్టోబరు 21న నోటిఫికేషన్‌కు వీలుగా సన్నాహాలకు దిగుతున్నట్టు అప్పట్లో కలెక్టర్ వెట్రిసెల్వి ప్రకటించారు. ఇంతచేస్తే అప్పట్లో సవ్యంగా ఎన్నికల ఏర్పాట్లు చేయలేకపోవడంతో సంఘాల ఎన్నికలు వాయిదా వేశారు. చాలా ప్రాంతాల్లో భారీ వర్షాలు ముంచెత్తడంతో ఎన్నికల నిర్వహణ అసాధ్యంగా మారిందన్న కారణంతో అప్పట్లో ఈ ఎన్నికలు వాయిదా పడ్డాయి. మళ్లీ తిరిగి ఈనెల 5న నోటిఫికేషన్ జారీ చేసి ఎన్నికలకు సమాయత్తపర్చాల్సిందిగా మరో ఆదేశం జారీ అయినా ఇది కూడా రద్దయ్యింది. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి ఈనెల 14 నుంచి ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు, సన్నాహాలకు సిద్ధమవ్వాల్సిందిగా మంత్రి రామానాయుడు ఆదేశాలు జారీ చేశారు.

ఆది నుంచి అడ్డంకే..

ఒకప్పుడు సాగునీటి సంఘాల నిర్ణయాలు రైతుల అభిప్రాయాలకు చేరువగా ఉండేవి. జిల్లా వ్యాప్తంగా 356 నీటి సంఘాలకు, రెండు ప్రాజెక్టు కమిటీలకు, 35కి పైగా డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా దీనికి తగ్గట్టుగా ఆయా సంఘాల ఓటర్ల జాబితా రూపొందించాల్సి ఉంది. రెండుమార్లు నోటిఫికేషన్ విడుదలై పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినా ఓటర్ల జాబితాలో స్పష్టత రాలేదు. ప్రత్యేకించి ఇరిగేషన్, రెవెన్యూ మధ్య ఉన్న అగాధం దీనికి ప్రధాన కారణం. ఎక్కడెక్కడ నీటి సంఘాలున్నాయి, డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీలకు ఏఏ చోట్ల ఎన్నికలు నిర్వహించాలనేది జల వనరుల శాఖ నిర్ధారిస్తుంది. దీనికి అనుగుణంగా మిగతా ఎన్నికల ఏర్పాట్లను రెవెన్యూనే పర్యవేక్షించాలి. కాని ఇక్కడ ఉన్నత స్థాయిలో ప్రత్యేక సమీక్ష లేకపోవడం, క్షేత్రస్థాయిలో అవగాహన లోపంతో ఓటర్ల జాబితాను రూపొందించడంలో విఫలమయ్యారు. రెండోసారి నోటిఫికేషన్ విడుదలైన తర్వాత తహసీల్దార్ కార్యాలయాల్లో ఓటర్ల జాబితా ప్రదర్శించాల్సి ఉండగా ఎక్కడా కనిపించలేదు. ఇప్పటికీ అలాంటి సందిగ్ధతే కొనసాగుతోంది. జాబితా పాతది ఉన్నా కొంత సవరించుకునే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితిలోను ఓటర్ల జాబితాలను రూపొందించలేక చేతులెత్తేశారు. జల వనరుల శాఖలో అధికారులు, సిబ్బంది సంఖ్య అంతంత మాత్రమే. రెవెన్యూ పూర్తిగా సహకరించి ఎన్నికల నిర్వహణలో తమకు ఉన్న అనుభవాన్ని తాజా ఆదేశాల ప్రకారం అమలు చేయొచ్చు. ఉన్నత స్థాయిలోనే ఒక స్పష్టత లేకపోవడంతో ఆఖరుకి మంత్రి రామానాయుడు ఆదేశించినా దిక్కుమొక్కు లేకుండా పోయింది. ఈనెల 14 నుంచి వారం రోజుల్లోపు నీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీల ఎన్నికలు నిర్వహించాలని తాజాగా ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ పరిస్థితుల్లో ఎన్నికలన్నీ అనుకున్న తేదీల్లోనే సవ్యంగా పూర్తవుతాయా..? లేదా..? అనేదే ఇప్పుడు రైతులందరిలోనూ ఉన్న సందేహం.

మీకెన్ని.. మాకెన్ని

కూటమిలో భాగస్వామ్య పక్షాలు ఎక్కడెక్కడ, ఎవరికెన్ని సంఘాల్లో పోటీ చేయాలనే దానిపై స్పష్టతలేదు. తాజాగా ఈనెల 14న ఎన్నికలు జరపాల్సి ఉన్నందున ఈలోపే జనసేన, బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో కాస్తంత ఎక్కువగా ఆయా పార్టీలకు, మిగతా స్థానాల్లో తెలుగుదేశం అనుకూలురు పోటీ చేసేందుకు స్పష్టత వస్తోంది. ఇదే విషయాన్ని మంత్రి రామానాయుడు ప్రత్యేకంగా ప్రస్తావించినట్టు సమాచారం. టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ఆ పార్టీనే అత్యధిక సంఘాల్లో పోటీ చేసి మరికొన్ని సంఘాలను మిత్రపక్షాలైన బీజేపీ, జనసేనలకు వదిలేయాలన్న సంకేతాలు వచ్చాయి. ఒకదశలో తెలుగుదేశం యేతర ఎమ్మెల్యేలు ఉన్న స్థానాల్లో 60 శాతం మేర ఆ పార్టీ అనుకూలురే పోటీ చేసుకోవచ్చంటూ ప్రచారం సాగింది. దీంతో టీడీపీ శ్రేణులన్నీ గందరగోళంలో పడ్డాయి. ఉదాహరణకు ఉంగుటూరు నియోజకవర్గంలో టీడీపీకి తిరుగులేని బలం ఉంది. ఇక్కడ నుంచి ఎమ్మెల్యేగా జనసేన పక్షాన ధర్మరాజు ఎన్నికయ్యారు. దామాష పద్ధతిలో అత్యధిక సంఘాల్లో జనసేనకు కేటాయిస్తే కేవలం కొన్ని సంఘాలకు మాత్రమే టీడీపీ పరిమితమవుతుంది. ఇలాంటి సమస్యలు క్షేత్రస్థాయిలో తలెత్తుతున్నాయి.



హోంగార్డుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఐజీ జీవీజీ అశోక్‌కుమార్

హోంగార్డుల సేవలు ప్రశంసనీయం : ఐజీ

ఏలూరు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హోంగార్డు విభాగం పోలీస్‌శాఖలో అంతర్‌భాగమైందని వారు చేస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. హోంగార్డ్ డేను పురస్కరించుకుని ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం ఉదయం జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐజీ హాజరయ్యారు. తొలుత హోంగార్డుల పరేడ్‌ను పరిశీలించి గౌరవవందనాన్ని స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ హోంగార్డ్స్ పోలీసులతో సమాంతరంగా విధులను నిర్వర్తిస్తున్నారన్నారు. హోంగార్డు సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డులకు సీఎఫ్‌ఎంఎస్ నెంబర్ తొలగించడం వల్ల ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, పథకాలు వారికి వర్తించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏఆర్ ఆర్‌ఐ పవన్ కుమార్, జిల్లాలోని హోంగార్డుల నిర్వర్తించే విధులను వివరించారు. వివిధ క్రీడల విజేతలైన హోంగార్డులకు ఐజీ, ఎస్పీ బహుమతులు అందించారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్‌ఎస్‌ఎస్ శేఖర్, హోంగార్డు యూనిట్ ఆర్‌ఎస్‌ఐ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మన్ పద్మశ్రీ

పేదల పెన్నిధి అంబేడ్కర్ : జడ్పీ చైర్మన్

ఏలూరు సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో డా. బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలు, దళితులు, బలహీన వర్గాల కోసం పోరాడిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక తదితర రంగాల్లో అణగారిన వర్గాలకు సమాన వాటా, సమన్యాయం దక్కేలా రాజ్యాంగాన్ని పొందుపరచడంలో అంబేడ్కర్ కృషి అనిర్వచనీయమన్నారు. విద్య, సామాజిక మార్పుకోసం తన జీవితాన్ని అంకితం చేసిన దార్శనికుడు అని ఆమె కొనియాడారు. టీడీపీ నేత ఘంటా ప్రసాద్, కార్యాలయ ఏవోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహ పూర్వక గ్రామాలే ధ్యేయం : డీపీవో

ఏలూరుసిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని మెరుగైన జీవనోపాధి గల గ్రామాలుగా, మహిళా స్నేహపూర్వక గ్రామాలుగా తీర్చిదిద్దడానికి అన్ని ప్రభుత్వ శాఖలు పనిచేయాలని డీపీవో కె.అనురాధ కోరారు, ఏలూరులోని డీపీఆర్సీలో సుస్థిర అభివృద్ధి లక్ష్యా లపై నిర్వహిస్తున్న శిక్షణను శుక్రవారం ఆమె పరిశీలించారు. మహిళల జీవితం, వృత్తికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నప్పుడే నిజమైన మహిళా సాధికారిత అన్నారు. ఏపీఎస్‌ఐఆర్డీ డైరెక్టర్ జి.రమణ, రీసోర్స్ పర్సన్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కృష్ణా రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు సహకరించాలి

ఏలూరు సిటీ, డిసెంబరు 6 : కృష్ణా జిల్లా రైతుల నుంచి ధాన్యం కొనుగోలుపై జిల్లా రైస్ మిల్లర్లతో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అత్యవసర సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా రైస్ మిల్లర్స్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వాతావరణంలో ప్రతికూల మార్పుల కారణంగా కృష్ణా జిల్లాలో ఒక్కసారిగా పంటకోతలతో పెద్దమొత్తం ధాన్యం పోగు పడిన కారణంగా సీఎం సూచనల మేరకు కృష్ణా జిల్లా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు. జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమస్యలను పరిష్కరించేందుకు 08812-230448, 77020 03584, టోల్‌ఫ్రీ నెంబరు 18004256453 నెంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

నేను వస్తున్నా.. మీరూ రండి!

- సామూహిక ఆహ్వానం పలికిన కలెక్టర్ వెట్రిసెల్వి
- నేడు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

ఏలూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : 'దెందులూరు చిల్డ్రన్స్ హోంలో 17 మంది బాలికలకు కస్టోడియన్‌గా ఉన్నా. దాతలు, విద్యావేత్తలు, పూర్వ విద్యార్థులతోపాటు స్కూలు విద్యార్థుల తల్లిదండ్రులు..ఇలా సామాజిక భాగస్వామ్యంతోనే నాణ్యతతో కూడిన విద్యను అందించగలం. జిల్లాలో 1,788 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులందరూ శనివారం పండుగ వాతావరణంలో నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి హాజరుకావాలని అభ్యర్థిస్తున్నా. నేనూ వస్తున్నా'.. కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపు ఇది. విద్యాహక్కు, జాతీయ విద్యావిధానంలో భాగంగా సామాజిక భాగస్వామ్యమే అజెండాగా పీటీఏ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన మీడియా సమావేశంలో కలెక్టర్ వివరించారు. ఉదయం 9గంటలకు తల్లిదండ్రులకు ఆహ్వానాలతో ఈ సమావేశం ప్రారంభమై మధ్యాహ్నం 12.45 గంటలకు సహపంక్తి భోజనంతో ముగుస్తుందన్నారు. డీఈవో వెంకటలక్ష్మి మాట్లాడుతూ పీటీఏ నిర్వహణ నిమిత్తం మొత్తం 13 కమిటీలను నియమించామని, నిర్వహణ ఖర్చుల కోసం పాఠశాలలకు రూ.35,92,800లను ఎస్‌ఎంసీ ఖాతాలకు జమ చేశామన్నారు. వట్లూరులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించే పీటీఏ సమావేశానికి హాజరుకావాల్సిందిగా అభ్యర్థిస్తూ స్కూలు విద్యార్థినులు ఆహ్వానపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ప్రిన్సిపాల్ మేరీ ఝాన్సీరాణి, ఎంఈవో డి.వి.రమణ, టీచర్లు చైతన్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న విద్యార్థిని, తదితరులు

కారణాలు అనేకం..

ప్రమోషన్లు రాకపోవడానికి ప్రధానంగా రాజకీయ నాయకులు, పాలకులు అడ్డుపడుతున్నారనే విమర్శలున్నాయి. వారికి కావాల్సిన వారికి అర్హతలు లేకపోయినా ప్రమోషన్లు ఇవ్వాలనే డిమాండ్లు ఎక్కువవడంతో ప్రమోషన్లు ఆగిపోతున్నాయనే విమర్శలున్నాయి. దీనివల్ల నిజంగా అర్హతలున్నా వ్యక్తులు ప్రమోషన్లు రాక తీవ్రంగా నష్టపోతున్నారు. అర్హత కలిగినవారు కొంతమంది కోర్టు మెట్లు ఎక్కుతున్నారు. వారిలో కొందరు కేసులు గెలిచి ప్రమోషన్లు తీసుకుంటున్నారు. మరికొందరు కోర్టుల చుట్టూ తిరగాలేమని ప్రమోషన్ల లిస్టు జోలికే పోవడంలేదు. వీటితోపాటు సిబ్బంది కూడా ఒకరిపై ఒకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసుకోవడం వల్ల కూడా పదోన్నతుల బ్రేక్‌కు ఒక కారణమన్న వ్యాఖ్యలు విన్పిస్తు న్నాయి. ఏదిఏమైనా ఇప్పటికైనా అధికారులు సీనియార్టీ లిస్టు తయారు చేసి ప్రమోషన్లు ఇవ్వాలని అర్హులైన ఉద్యోగులు కోరుతున్నారు.

పదోన్నతుల ఊసేలేదు!

- నగరపాలక సిబ్బంది ఎదురుచూపులు
- 30కి పైగా పోస్టులు ఖాళీ.. అర్హతలున్నా దక్కని ప్రమోషన్
- గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పరిస్థితి మరీ దారుణం

ఏలూరు టూటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 'ప్రమోషన్లు లేక తీవ్ర నిరాశలో ఉన్నాం. ప్రమోషన్లు రాకుండానే రిటైర్ అయిపోతామేమోనని ఆందోళనగా ఉంది. ఉద్యోగంలో చేరి 25 ఏళ్లు పైగా అవుతున్నా ఇంతవరకు ఒక ప్రమోషన్ కూడా లేక తీవ్ర నిర్వేదంలో ఉన్నాం'.. ఇది నగరపాలక సంస్థ ఉద్యోగుల ఆవేదన.

రాష్ట్రంలో నగరపాలక సంస్థల్లో అర్హులైన ఉద్యోగులకు ఎప్పటికప్పుడు పదోన్నతులు కల్పిస్తున్నా ఏలూరు నగరపాలక సంస్థలో ఈ ప్రక్రియ జరగడం లేదు. సుమారు 30కి పైగా పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికి పదోన్నతులు లభించడం లేదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కార్పొరేషన్‌లో ఒక ఉద్యోగికి కూడా ప్రమోషన్ ఇవ్వలేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చీరావడంతోనే అప్పటి ఎమ్మెల్యే అనుంగులకు అర్హతలు లేకపోయినా ఇద్దరికి ప్రమోషన్లు ఇచ్చారన్న విమర్శలున్నాయి. సూపరిండెంటెండ్‌లు పోస్టులు రెండు ఖాళీగా ఉండగా తొమ్మిది మంది అర్హులున్నారు. సీనియర్ అసిస్టెంట్లు మూడు ఖాళీలు ఉండగా అర్హులు 27 మంది ఉన్నారు. జూనియర్ అసిస్టెంట్లు ఖాళీలు మూడు ఉండగా అర్హులు 15 మంది ఉన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆరు ఖాళీలు ఉండగా ఐదుగురు అర్హులున్నారు. శానిటరీ సూపర్‌వైజర్ పోస్టు ఒకటి ఖాళీ ఉండగా అర్హులైన వారు ఒకరు ఉన్నారు. హెల్త్ అసిస్టెంట్ పోస్టులు ఏడు ఖాళీలు ఉండగా అర్హులు ఆరుగురు ఉన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఖాళీలు ఒకటి ఉండగా ఆరుగురు అర్హులున్నారు. వీరంతా ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఏటా ప్రమోషన్ల జాబితా తయారు చేస్తుంటారు. గత ఐదేళ్ల నుంచి కనీసం సీనియార్టీ లిస్టును తయారు చేయడం లేదు. కారణమేమిటో పాలకులకు, అధికారులకు తెలియాలి. జూనియర్ అసిస్టెంట్ల పరిస్థితి మరీఘోరం. వీరిలో కొందరు ఉద్యోగంలో చేరి 25 ఏళ్లకు పైగా అయ్యింది. ఇంత వరకు ప్రమోషన్ లేక తీవ్ర నిరాశలో ఉన్నారు. ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్లుగా చేరిన వారు జిల్లా అధికారులైన వారు ఉన్నారు. కార్పొరేషన్‌లో మాత్రం జూనియర్ అసిస్టెంట్ పోస్టుల్లోనే కొనసాగుతున్నారు. నగరపాలక సంస్థలో సర్వీసు రూల్స్ లేకపోవ డంతో ఎక్కడవారు అదే కార్పొరేషన్లలో రిటైర్ అవ్వాల్సిన పరిస్థితి.



హరికథా దాసుడు
అనందాసు



ఆరు దశాబ్దాలుగా హరికథా గానం
వృద్ధాప్యంలోను సడలని గాత్రం

ముదినేపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆయన గాత్రం మధురం.. గానం సుమధురం.. పురాణాలు, ఇతిహాసాలను అవలీలగా వల్లె వేయగల కథకుడు. ఎనిమిది పదుల వయస్సు దాటినా తన కంచు కంఠంతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. ముదినేపల్లి మండలం చేవూరుపాలెంకు చెందిన సువర్ణ గంటా కంకణ బిరుదాంకితుడు అనందాసు కృష్ణమూర్తి భాగవతార్ ప్రస్థానం యువతకు స్ఫూర్తి. 60 ఏళ్ల క్రితం హరికథలు నేర్చుకుని ఉమ్మడి కృష్ణా జిల్లాలో సాటిలేని మేటి కథకుడిగా గుర్తింపు పొందారు. ఎన్నో సత్కారాలు పొందారు. ఆయన సమకాలికులు హరికథలు చెప్పడం ఏనాడో విరమించుకోగా, కృష్ణమూర్తి భాగవతర్ మాత్రం హరికథలపై ప్రేమతో వృద్ధాప్యం మీదపడినా ఇప్పటికీ హరికథా గానం చేస్తూనే ఉన్నారు. ఆయన ఇప్పటి వరకు 6000 హరికథా గాన ప్రదర్శనలు నిర్వహించారు.

చదివింది ఐదో తరగతి..!

1940లో చేవూరుపాలెంలో రంగయ్య, రంగ నాయకమ్మ దంపతులకు జన్మించిన అనందాసు కృష్ణమూర్తి 5వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. కొంతకాలం తర్వాత శ్రీహరిపురంలో అడుసుమిల్లి చిన్నయ్య వద్ద భజనలు నేర్చుకున్నారు. తర్వాత వీరవాసరంలో ప్రముఖ భాగవతార్ పులఖండం జానకి రామయ్య వద్ద శిష్యరికం చేశారు. 1962లో కృష్ణమూర్తి 22వ ఏట స్వగ్రామం చేవూరు పాలెం రామాలయం వద్ద ఉత్తర గోగ్రహణంపై తొలి హరికథ చెప్పి గ్రామస్థులను మెప్పించగలిగారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల శివలీలలు, బ్రహ్మంగారి చరిత్ర, భారతం, భాగవతంపై హరికథలు చెప్పారు. ఒడిశాలోని రూర్కెలా ఉక్కు కర్మాగారం వద్ద యాజమాన్యం ఆహ్వానంపై హరికథ చెప్పి ఘన సన్మానం పొందారు. కర్నాటక, మద్రాసు రాష్ట్రాల్లో కూడ వందల సంఖ్యలో హరికథల ప్రదర్శన ఇచ్చారు.

కంకణ ధారణ

రాష్ట్ర వ్యాప్తంగా వేలాది హరికథల ప్రదర్శనలిచ్చి పరిపూర్ణ భాగవతార్‌గా రూపాంతరం చెందిన కృష్ణమూర్తి భాగవతార్ కంకణ ధారణ గౌరవం పొందారు. సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ప్రముఖ రంగ స్థల నటుడు మద్దాల రామారావు కంకణం తొడిగి సువర్ణ గంటా కంకణ బిరుదునిచ్చి సత్కరించారు.

సుమారు 65 ఏళ్లుగా కృష్ణమూర్తి భాగవతార్ హరికథాగానంతో ప్రజాభిమానం పొందాడు. హరికథలకు ఆదరణ తగ్గినప్పటికీ ఆయన కథ చెబుతున్నాడంటే ఇప్పటికీ జనం వస్తారు. కృష్ణమూర్తి సతీమణి మణి శకుంతల కూడ భర్తను కళారంగంలో ప్రోత్సహించడం కారణంగా ఆయన హరికథాగానంపై ప్రత్యేక శ్రద్ధ చూపించగలిగారు. ఇప్పటి ఆయన ప్రదర్శనలతో కృష్ణమూర్తి జీవితమంతా కళా రంగానికే అంకితమైంది.



22 ఏళ్ల వయసు, 80 ఏళ్ల వయసులో హరికథా గానం చేస్తున్న కృష్ణమూర్తి

భవానీ ప్రసాద్‌కు మానవ హక్కుల ప్రతిభా పురస్కారం



ఆర్.భవానీ ప్రసాద్

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం (ఎల్ఎఫ్ఎల్) రాయపూడి భవానీ ప్రసాద్‌కు అరుదైన గౌరవం దక్కింది. మానవ హక్కుల ప్రతిభా పురస్కారం అందుకోనున్నారు. ఒడిశా, తెలం గాణ, కర్నాటక, చత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్, తది తర రాష్ట్రాల నుంచి వివిధ రంగాల్లో ప్రతిభావంతులకు అవార్డులను ప్రకటించారు. ఈనెల 10న కాకినాడలో జరిగే అంతర్జాతీయ మావన హక్కుల దినోత్సవ కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నట్లు భవానీప్రసాద్ శుక్రవారం విలేకర్లరు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నుంచి అవార్డుకు ఆయన ఎంపిక అయ్యారు. పాఠశాలలో కిచెన్, గార్డెన్, పాఠశాల పరిసరాలు పరిశుభ్రత, విద్యార్థుల మరుగుదొడ్ల నిర్వహణ, పాఠ్యాంశాల బోధనలు, దాతల నుంచి పాఠశాలకు అవసరమైన వనరులు సేకరించడం, ఉపాధ్యాయ వృత్తితో పాటు సామాజిక సేవల్లో పాల్గొన్న భవానీ ప్రసాద్‌కు అవార్డు లభించింది. మంత్రి నిమ్మల రామానాయుడు, పాఠశాల అభివృద్ధి దాతలు పీఎండీ వీ.ప్రసాద్, నడపన జగపతి, కామిశెట్టి అయ్యప్ప నాయుడు, ఎంఈవో వీరాస్వామి, గంగాధరశర్మ, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు భవానీ ప్రసాద్‌ను అభినందించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

డ్రై డే నిర్వహణలో అశ్రద్ధ వద్దు

జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు



నీటి తొట్టెలను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

పాలకొల్లు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహణలో అశ్రద్ధ తగదని జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు అన్నారు. 'కొత్తరక్తం కోసం వెతకండి' శీర్షికన (దోమల సమావేశం) ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. మలేరియా అధికారి గులాబ్ రాజ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులో డ్రైయినేజీలు, తహసీల్దార్ కార్యాలయం వద్ద, కబేళా వీధుల్లో పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. నీటి నిల్వలున్న డ్రమ్ములు, కొబ్బరి బోండాలు, పాత టైర్లను పరిశీలించి పారిశుధ్య సిబ్బందికి సూచనలు ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ విజయ సారధి మాట్లాడుతూ డ్రైయినేజీల్లో పూడిక తొలగించాలని, నీటి నిల్వలు ఉన్నచోట దోమల మందు పిచికారి చేయించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో బంగారు వారి చెరువుగట్టు అర్బన్‌హెల్త్ సెంటర్ డాక్టర్ చంద్రశేఖర్, ఏఎంవో శ్రీనివాసరావు, వై.బాలచంద్రుడు, హెచ్‌వి స్వర్ణలత, ఏఎన్ఎంలు, ఆశాలు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్‌సీఎం ప్రార్థనా మందిరంలో ప్రసంగిస్తున్న బిషప్ జయరావు

క్రీస్తు మార్గంలో పయనించాలి

సెమీ క్రిస్మస్ వేడుకల్లో బిషప్ జయరావు

పెదవేగి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : క్రీస్తు మార్గంలో పయనించే ప్రతి ఒక్కరూ దేవుని బిడ్డలేనని, వారికి దేవుని ఆశీస్సులు మెండుగా ఉంటాయని ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావు పొలిమేర అన్నారు. కొప్పులవారి గూడెం పంచాయతీ నాగన్నగూడెంలో నిర్మించిన నిత్య సహాయమాత ఆర్‌సీఎం ప్రార్థనా మందిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ప్రతి వ్యక్తి ప్రతి పనిలోనూ క్రీస్తు నామాన్ని తలచుకుంటే ఆ దేవుడే వారిని రక్షిస్తాడన్నారు. కార్యక్రమంలో విచారణ గురువు ఫాదర్ జేవియర్, దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, ఫాదర్ డాక్టర్ పి.బాల, ఫాదర్ దివాకర్, ఫాదర్ చార్లెస్, అక్కిరెడ్డిగూడెం, నాగన్నగూడెం సంఘ పెద్దలు, విశ్వాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కనబడని కెమెరా కన్ను





కనబడని నాలుగో సింహం పోలీస్ అయితే.. ఆ సింహానికి మరో కన్ను సీసీ కెమెరా.. ప్రస్తుత ఆధునిక సాంకేతిక ప్రపంచంలో నేరస్థుల కదలికలు పసిగట్టి నేరాలు నియంత్రించడంలో సీసీ కెమెరా సమర్థవంతమైన సాధనం. ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా ఇది గుర్తించారు. నగరం, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు, ప్రధాన రహదారుల్లో వీటిని ఏర్పాటు చేయడంతో నేరస్థులు వెనక్కి తగ్గారు. వ్యాపారుల దుకాణాలతో పాటు, అపార్ట్‌మెంట్‌లు, పలు నివాసాల్లో కెమెరాల ఏర్పాటుతో కొంత భద్రత చేకూరింది. కానీ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటైన కెమెరాల కన్ను మూతపడింది. నిరంతరాయం నిశితంగా గమనించే కెమెరాలు చాలాచోట్ల మరమ్మతులకు గురయ్యాయి. వాటిని పట్టించుకునే వారే లేరు. దీనితో పట్టణాల్లో మహిళల మెడలో గొలుసులు, వాహన చోరీలు యథాతథంగా మారాయి.

- నగరం, పట్టణాల్లో పనిచేయని సీసీ కెమెరాలు
- ఏలూరులో కొంతవరకు మెరుగు
- భీమవరంలో సగంపైగా రిపేర్
- రెచ్చిపోతున్న నేరస్థులు



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గతంలో 860 కెమెరాలను ఏర్పాటు చేశారు. జిల్లా విభజన అనంతరం ఏలూరు జిల్లాలో 350 కెమెరాల వరకూ ఉన్నాయి. పశ్చిమలో భీమవరంలో మాత్రమే ఎక్కువ కెమెరాలు ఏర్పాటయ్యాయి. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన పసిగట్టడానికి సీసీ కెమెరాలు కీలకం. జిల్లా వ్యాప్తంగా నగరం, పట్టణాలతో పాటు ప్రభుత్వం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది.



తణుకు పట్టణంలో సీసీ కెమెరాలు



ఏలూరులో నిఘా నేత్రం

ఏలూరు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీసీ కెమెరాల పనితీరు ప్రశ్నార్థకంగా మారింది. నిర్వహణ, పర్యవేక్షణ ఒక ప్రైవేటు సంస్థకు అప్పగించారు. మరో 3 వేల కెమెరాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. కాగా నగరంలోని ప్రధాన కూడళ్లు, నగరంలో ప్రవేశించే మార్గాల్లో సుమారు 100 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని జిల్లా పోలీస్ కార్యాలయానికి అనుసంధానించారు. కెమెరాల ఆధారంతో అనేక కేసులను పోలీసులు ఛేదించగలిగారు. ఆందోళనలు, ఉద్యమాలు జరిగిన సమయంలో ఎంతమంది పాల్గొన్నారు, ఏ ప్రాంతంలో ఉన్నారు, వారు వెళ్లే మార్గాలను అంచనా వేసి పోలీసు బలగాలను ఆ ప్రాంతానికి పంపిస్తారు.

ఏలూరు నగరంలో రెండు ప్రధాన ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్లు ఉన్నాయి. ఫైర్‌స్టేషన్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే వాహన నెంబర్ ప్లేటు ఆధారంగా ఆటోమేటిక్‌గా ఫైన్ విధిస్తారు. అంబులెన్సులకు కూడా ఫైన్లు అనేకం విధించడం జరిగింది. ఏలూరు నగరంలో సీసీ కెమెరాల దెబ్బకు ఆటో వాలాలు అబ్బా అంటూ అధికారుల వద్దకు వెళ్లి గోడును వినిపించుకున్నారు. తమకు తెలియకుండానే పడిపోయాయని ఒక్కొక్క ఆటోకు వేల రూపాయల జరిమానా పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫైర్‌స్టేషన్, పాత బస్టాండ్ సెంటర్లలో రెడ్‌సిగ్నల్ ఉండగా ఒక్క అడుగు వాహనం ముందుకు వెళ్లినా ఫైన్ కట్టి తీరాల్సిందే.

తణుకులో కళ్లు కప్పి..

తణుకు: పట్టణంలోని ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాలున్నా నేరాల నియంత్రణలో తడబాటు తప్పడం లేదు. కెమెరాల కళ్లుగప్పి మరీ దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. పట్టణంలో 21 కెమెరాలు ఏర్పాటు చేశారు. మరో ఆరు మరమ్మతులకు గురయ్యాయి. పట్టణంలోని అన్ని ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేయడానికి మరో 15 కెమెరాలు అవసరం. ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. సంఘటన జరిగిన ప్రాంతంలో కెమెరా ఆధారంగా చర్యలు చేపడతారు.

పాలకొల్లులో పని చేయవు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు కొంత కాలంగా పనిచేయడం లేదు. కెమెరాల పర్యవేక్షణకు హౌసింగ్ బోర్డు కాలనీలోని రిజర్వుడ్ స్థలంలో చిన్నపాటి భవనాన్ని నిర్మించారు. సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ఈ భవనం దరిదాపులకు కూడా పోలీసులు వెళ్లడంలేదు. ఆ భవనం ఆవరణ పిచ్చి మొక్కలతో నిరుపయోగంగా మారింది. ప్రధాన రద్దీ ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. పూలపల్లి, బ్రాడీపేట, దొడ్డిపట్ల రోడ్డు, నరసాపురం రోడ్డు, గాంధీ బొమ్మల సెంటర్, లాకుల సెంటర్, పెద్ద గోపురం వద్ద సీసీ కెమెరాలు నిరుపయోగంగా ఉన్నాయి.

తాడేపల్లిగూడెంలో అలంకారం



తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలో సీసీ కెమెరాలు అలంకారప్రాయమే. ప్రధాన కూడళ్లలో 54 కెమెరాలు, దాతల సహకారంతో మరో 72 కెమెరాలు ఏర్పాటు చేశారు. 20 కెమెరాలు కూడా పని చేయడం లేదు. మరమ్మతు చేయించామని సీఐ సుబ్రహ్మణ్యం చెప్పారు.

జంగారెడ్డిగూడెంలో జాడే లేదు



జంగారెడ్డిగూడెం: పట్టణంలో నేరస్తుల కదలికలు పసిగట్టే కెమెరాలు పూర్తిస్థాయిలో లేవు. ఉన్నవి కూడా పనిచేయక నేరస్తులకు కలిసి వచ్చింది. కెమెరాలతోనే నేరాలను అరికట్టడం సాధ్యం కాదనే అధికారుల ధోరణితో పట్టణంలో నిఘా కొరవడింది.

పుష్కరాల నాటి కెమెరాలు..



భీమవరం క్రైం: పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణం కొంత కాలంగా చోరీలు, నేరాల కేంద్రంగా మారింది. మహిళల మెడలో బంగారు వస్తువులతోపాటు ద్విచక్ర వాహనాల చోరీలు పెరిగాయి. సీసీ కెమెరాల ఏర్పాటుతో దుండగుల ఆగడాలకు అడ్డుకట్టపడింది. ప్రస్తుతం కెమెరాలు పనిచేయకపోవడంతో నేరాలు పెరిగాయి. పట్టణంలో వివిధ దుకాణదారులు ఏర్పాటు చేసుకున్న కెమెరాలే దిక్కు. పట్టణంలో కెమెరాలు పని చెయ్యకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని పోలీసులు చెబుతున్నారు. 2015లో గోదావరి పుష్కరాల సమయంలో గోదావరి చుట్టుపక్కల ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేశారు. పుష్కరాలు ముగిసిన అనంతరం ఆ కెమెరాలను కొన్ని పట్టణాలకు అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయించింది. పట్టణంలో 32 కెమెరాలను మ్యాట్రిక్స్ సంస్థ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న కెమెరాలు చాలాకాలం పనిచేశాయి. దొంగలు కూడా భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. తర్వాత కెమెరాల నిర్వహణ కొరవడి మరమ్మతులకు గురయ్యాయి. వైసీపీ పాలనలో 2020 నుంచి మూలనపడ్డాయి. ప్రస్తుతం కెమెరాల మరమ్మతుకు అంచనా వేయగా సుమారు రూ.8.5 లక్షల ఖర్చు తేలడంతో పోలీసులు కొందరు దాతలను సంప్రదించారు. ప్రస్తుతం బస్టాండ్‌లో మాత్రం కొన్ని కెమెరాలను అమర్చి పోలీసుల ఆధ్వర్యంలో వాటిని పర్యవేక్షిస్తున్నారు.





షష్టి వైభవం



● జిల్లాలోని పలు ఆలయాల్లో ఘనంగా వేడుకలు ● శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం ● తరలివెళుతున్న భక్తులు

ఏలూరుసిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి షష్టి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. జిల్లాలో పలుచోట్ల శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించగా మరికొన్ని ఆలయాల్లో శనివారం కల్యాణం జరగనుంది. ఉంగుటూరు మండలం కైకరం, ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రం, ఏలూరు నాగదేవి ఆలయం, చింతలపూడి సమీపంలోని నాగిరెడ్డిగూడెం, మునునూరు, మండవల్లి, ముదినేపల్లి, తదితర ప్రాంతాల్లో సుబ్రహ్మణ్య షష్టి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఆ ఆలయ కమిటీలు ఏర్పాట్లు ఘనంగా చేశాయి. కైకరంలో షష్టి రోజున భారీ అన్నసమారాధన నిర్వహించారు. కైకరంలో షష్టి తీర్థం ఏర్పాటు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని అత్తిలి తర్వాత అంత భారీగా కైకరంలో షష్టి ఉత్సవాలు నిర్వహిస్తారు. కైకరంలో షష్టి ఉత్సవాలు ప్రారంభించి 9దశాబ్దాలు కావడంతో ఈ సారి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ప్రతి గ్రామంలో షష్టి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాలన్నింటినీ విద్యుత్ దీపాతలతో అలంకరించారు.

మార్గశిర షష్టి..

శివుని రెండో కుమారుడైన సుబ్రహ్మణ్యస్వామిని కుమారస్వామి, కార్తికేయుడు, స్కందుడు, షణ్ముఖుడు, మురుగన్, గుహుడు తదితర పేర్లతో పిలుస్తారు. మార్గశిర శుద్ధ షష్టిని సుబ్రహ్మణ్య షష్టిగా నిర్వహిస్తారు. దీనినే చంపా షష్టి, ప్రవార షష్టిగా పిలుస్తుండగా తమిళులు దీనిని స్కంద షష్టిగా పిలుస్తారు. దేవేంద్రుడు షష్టినాడు దేవసేనతో సుబ్రహ్మణ్యస్వామి వారికి అత్యంత వైభవంగా వివాహం జరిపించిన రోజునే సుబ్రహ్మణ్య షష్టిగా వ్యవహరిస్తారు. సర్వశక్తి స్వరూపుడైన వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామికి భక్తులు కల్యాణోత్సవాలతో పాటు సహస్రనామ పూజలు చేస్తారు. సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన వల్ల నేత్ర రోగాలు, చర్మవ్యాధులు, తొలగుతాయని, పెళ్లికాని వారికి వివాహ యోగం కలుగుతుందని, సంతానం కలిగి ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లుతారని భక్తుల విశ్వాసం. సంతానం కలిగిన వారు స్వామి వారికి సహస్రనామాలతో ఇష్టమైన పేరును వారి పిల్లలకు పెట్టటం ఆనవాయితీ. ఈ పుణ్యదినం నాడు ఉదయాన్నే స్నానమాచరించి సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుంటారు. పిల్లలు లేని వారు సంతానం కోసం సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ తంతులో తలంబ్రాలను దోసిటలో తీసుకుని వాటిని పరమాన్నంగా వండుకుని తింటారు. దీనితో సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. వారు ఆరోజున ఉపవాసం ఉండి సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తారు. సుబ్రహ్మణ్య షష్టి రోజున భక్తులు స్వామి వారికి పాలు, పండ్లు, పువ్వులు, వెండి పడగలు, వెండి కళ్ళు మొదలైన మొక్కుబడులు తీర్చుకుంటారు.

అత్తిలిలో వెలుగులు

అత్తిలి: శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభయ్యాయి. ఈనెల 20 వరకు స్వామి వారి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. ప్రతి రోజు సాయంత్రం స్వామివారి కళావేదికపై పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ ముఖద్వారం నుంచి ఆలయం వరకు గల ప్రధాన మార్గాలలో విద్యుత్ దీపాలతో దేవతా మూర్తుల సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ పరిసరాలలో రంగులరాట్నం, జెయింట్‌వీల్స్, ఎగ్జి బిషన్ నెలకొల్పారు. శనివారం ఉదయం కోలాట భజన, అన్నసమారాధన, రాత్రి స్వామి వారి ఊరేగింపు జరుగుతాయని కమిటీ చైర్మన్ కురెళ్ల ఉమామహేశ్వరరావు, దిరిశాల మాధవరావు తెలిపారు.



అత్తిలిలో సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణంలో భక్తులు



అత్తిలిలో సుబ్రహ్మణ్యేశ్వరుడు



సింగరాయపాలెంలో..



సింగరాయపాలెంలో పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

కల్యాణం.. కమనీయం

అత్తిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అత్తిలిలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అత్తిలికి చెందిన కూనపరెడ్డి తేజ, విజయలక్ష్మి దంపతులు స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఐలూరి శ్రీరామం, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కల్యానం జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ కురెళ్ళ ఉమామహేశ్వరరావు, కార్యదర్శి దాడి శ్రీనివాస రావు, ఉపాధ్యక్షులు దిరిశాల మాధవరావు, కోశాధికారి ఇర్రి వెంకట సత్యనారాయణ, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులు, మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, యడ్లపల్లి భద్రం, మద్దాల శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ బుద్దరాతి భరణి ప్రసాద్ పాల్గొన్నారు.

సింగరాయపాలెంలో వధూవరులుగా..

ముదినేపల్లి: మండలంలోని సింగరాయపాలెం చేవూరుపాలెం సెంటర్‌లో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్టి, స్వామి వారి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్వామివారిని, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేసి పూజలు నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రాల మధ్య స్వామి వార్లను నూతన వస్త్రాలతో అలంకరించి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి ఆధ్వర్యంలో అర్చకులు తోలేటి వీరభద్ర శర్మ, కోట శివశంకర శర్మ పూజలు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం విఘ్నేశ్వరపూజ, అగ్ని ప్రతిష్టాపన, ధ్వజారోహణ కార్యక్రమాలను జరిపారు. ఉత్సవాలకు నియమించిన ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయంలో పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. కమిటీ సభ్యులను అసిస్టెంట్ కమీషనర్ సత్కరించారు. సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

షష్టి ఉత్సవాల సందర్భంగా దేవస్థానం వద్ద పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కైకలూరు సీఐలు రవికుమార్, కృష్ణ ఆధ్వర్యంలో సుమారు 70 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

చనిపోయిన ఉద్యోగుల స్థానాల్లోనూ నియామకాలు!

- ఉద్యోగం మానేసినవారిపేరిటా మరికొన్ని పోస్టింగ్‌లు
- జీవోలనే మార్చేసి మరికొందరికి...
- కార్యాలయ అధికారులు, ఉద్యోగుల అవినీతివున్నట్టు ప్రచారం
- ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యోగుల లబోదిబో

ఏలూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యోగుల్లో జీవో 1207 ప్రకారం నియామకాలు పొందిన వారిని విధుల నుంచి తొలగిస్తూ డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట జారీచేసిన టెర్మినేషన్ ఉత్తర్వులతో పెద్ద దుమారమే రేగేలా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఈ నియామకాలకు సంబంధించి అప్పట్లో జారీ అయిన రెండు రకాల జీవోల్లో 1207 ఉత్తర్వులను హైకోర్టు డిస్మిస్ చేసిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో సంబంధిత జీవో మేరకు నియమితులయ్యారంటూ మొత్తం 111మంది ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యోగులను తక్షణమే విధుల నుంచి రిలీవ్ చేయాల్సిందిగా డీఎంహెచ్‌వో గురువారం ఉత్తర్వులు జారీచేసిన విషయం విదితమే. ఈ ఉత్తర్వులమేరకు ఉమ్మ డి జిల్లాలో సంబంధిత ఉద్యోగులను టెర్మినేట్ చేయడానికి ఆయా పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు శుక్రవారం సమాయత్తంకాగా, పలుచోట్ల ఉద్యోగుల నుంచి అభ్యంతరాలు ఎదురైనట్టు తెలిసింది. అసలు రిక్రూట్‌మెంట్ మొత్తం లోపభూయిష్టంగా ఉందని ఆరోపణలు వెల్లువెత్తడంతోపాటు, జీవోలను అడ్డుపెట్టుకుని ఇటీవల వరకు డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు, సిబ్బంది లంచాలు తీసుకుని అడ్డగోలుగా నియామకాలు జరిపారని ఆరోపణలు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం కొందరు ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యో గులు తాము జీవో 1207 పరిధిలో రిక్రూట్ కానప్పటికీ ఎలా టెర్మినేట్ చేస్తారంటూ నిలదీసేందుకు డీఎంహెచ్‌వో కార్యాలయానికి రాగా సోమవారం రావాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ నాగేశ్వరరావు సర్దిచెప్పి పంపించి వేయడం గమనార్హం. దీంతో రిక్రూట్ మెంట్‌లో పలు అక్రమ నియామకాలు జరిగినట్టు ప్రచారం ఊపందుకుంది. శుక్రవారం ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ నాగేశ్వరరావును కలుసుకున్న కొందరు ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యో గులు చెబుతున్న వివరాల ప్రకారం 2002లో జరిగిన రిక్రూట్‌మెంట్‌లో మొత్తం 205 పోస్టులు భర్తీ కావాల్సి ఉందని వివరించారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి అప్పటి నుంచి ఇటీవల వరకు నియామకాలు జరుగుతూనే ఉన్నాయని, ఈ క్రమంలో జీవో 273ప్రకారం నియమితులైన వారిలో ఏడుగురు ఎంపీహెచ్‌ఏ (మేల్) ఉద్యో గులను అక్రమంగా జీవో 1207లోచేర్చి తాజాగా టెర్మినేట్ చేయడానికి డీఎంహెచ్‌వో ఉత్తర్వులు జారీచేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు, ఉద్యోగు ల్లో కొందరి పాత్ర ఉందని ఆరోపించారు. తమకు జరుగుతున్న అన్యాయం, రిక్రూట్‌మెంట్‌లో లోపాలపై ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు లిఖిత పూ ర్వక ఫిర్యాదులు చేస్తూనేఉన్నప్పటికీ వాటి విచారణకు వచ్చేసరికి జిల్లాస్థాయిలో సంబం ధిత అధికారులు వాస్తవాలను మరుగు చేస్తున్నారని ఆరోపించారు. రిక్రూట్‌మెంట్‌లో ఎంపికై ఉద్యోగాల్లోచేరిన అనంతరం మృతి చెందిన వారు, ఉద్యోగం మానేసినవారు దాదాపు 20మంది వరకు ఉంటారని, వీటితో పాటు విభిన్నప్రతిభావంతుల కోటా కింద రిజర్వ్ చేసిన మరో నాలుగు పోస్టులను కూడా ఇతరుల తో నియామకాలు జరిపి డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ కేడర్ అధికారులు, ఉద్యోగులు అవినీతికి పాల్ప డ్డారని ఆరోపించారు. ఇలా అక్రమంగా జరిపిన నియామకాలన్నీ బయటకురాకుండా ఉండేందు కు నిబంధనల మేరకు జీవో 273 పరిధిలో నియమితులైన పలువురిని అన్యాయంగా జీవో 1207 ఉత్తర్వుల్లోకి చేర్చి టెర్మినేషన్ ఆర్డర్లు జారీచేయడానికి సిద్ధమయ్యారని ప్రచారం జరుగుతోంది.



రుణ భారం!

- ఏటా పెరుగుతున్న రుణగ్రహీతలు
- ఏలూరు జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు బ్యాంకులు ఇచ్చిన అప్పులు రూ. 9510 కోట్లు
- ఇందులో వ్యవసాయ రంగానికి ఇచ్చిన అప్పులు రూ.7360 కోట్లు
- ప్రైవేట్ అప్పులు కూడా భారీగానే..

ఏలూరుసిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రుణం తీసుకోకుండా జీవనం కష్టతరంగా తయారైంది. వ్యవసాయ రుణాలతో పాటు ఇతర అవసరాలకు ప్రతిఒక్కరూ ఏదోరకంగా రుణం పొందాల్సి వస్తోంది. 1వ తారీకు వస్తోందంటే రుణాలకు వడ్డీలు చెల్లించటానికి సొమ్ములు సమర్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. బ్యాంకులతో పాటు అనేక రకాల సంస్థల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ అప్పులు రోజురోజుకు పెరిగిపోతుండటంతో ప్రతి వ్యక్తిపై రుణ భారం పెరుగుతోంది. ఏలూరు జిల్లాలో ప్రైవేటు అప్పులు రూ.200 కోట్లు వరకు ఉంటాయని చెబుతున్నారు. ఏటా వ్యవసాయ రుణాలు కూడా పెరుగుతూ వస్తున్నాయి. ఈ ఏడాది జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు రూ.9510 కోట్లు వరకు రుణాలు బ్యాంకులు రుణాలు ఇచ్చాయి. ఇందులో ప్రధాన ప్రాధాన్యతా రంగమైన వ్యవసాయానికి రూ. 7360 కోట్లు వరకు రుణాలు ఇవ్వటం జరిగింది. ఇవిగాక ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారు వాయిదాల పద్ధతిలో చెల్లించే విధంగా రుణాలు పొందటం జరుగుతోంది. ఇవిగాక కార్పొరేట్ దిగ్గజ సంస్థలు వివిధ ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలుపై కూడా రుణాలు అందిస్తున్నారు.

బ్యాంకుల రుణాలు ఇలా..

జిల్లాలో ఈ ఏడాది మొత్తం వ్యవసాయ రుణాలు రూ.12,640 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా ఇప్పటివరకు రూ. 7360 కోట్లు వరకు ఇచ్చారు. స్వల్పకాలిక రుణాలుగా ఈ ఏడాది జిల్లాలో రూ.7950 కోట్లు లక్ష్యంగా నిర్ణయించుకోగా జిల్లాలో ఇప్పటివరకు రూ. 4435 కోట్లు వరకు బ్యాంకులు రుణాలు అందించాయి. ఎంఎస్‌ఎంఈ రుణాల లక్ష్యం రూ. 2460 కోట్లు కాగా ఇప్పటివరకు జిల్లాలో రూ. 1870 కోట్లు వరకు రుణాలను బ్యాంకులు అందించటం జరిగింది. జిల్లాలో మొత్తం ప్రాధాన్యతా రంగాలకు సంబంధించి ఈఏడాది రూ. 15,870 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించు కోగా ఇప్పటివరకు రూ. 9510 కోట్లు వరకు రుణాలను బ్యాంకులు అందించటం జరిగింది. గత ఏడాది కంటే ఈ సారి రుణ వితరణ శాతం పెరిగింది.

చిన్న వ్యాపారులకు రుణాలు

ముద్రా రుణాలలో భాగంగా జిల్లాలో చిన్న వ్యాపారులకు బ్యాంకులు రుణాలు అందించాయి. ఈ ఏడాది 22వేల మందికి రూ.285 కోట్లు వరకు రుణాలు అందించాయి. చిన్న వ్యాపారులకు, వీధి వ్యాపారులకు కూడా రుణ సౌకర్యం కల్పించటంలో బ్యాంకులు సఫలీకృతమయ్యాయి. 10వేల రూపాయల నుంచి 10లక్షల రూపాయల వరకు రుణాలను అందించటం జరుగుతోంది. ఇక జిల్లాలో 40వేల వరకు ఎస్‌హెచ్‌జీ గ్రూపులు న్నాయి. వీటికి సంబంధించి 4వేల కోట్ల రూపా యల వరకు బ్యాంకులు రుణాలు అందజేశాయి. డ్వాక్రా రుణాలు చెల్లింపులో రికవరీ రేటు 99శాతం పైగానే ఉంటోందని బ్యాంకుల వారే చెబుతున్నారు. కౌలు రుణ అర్హత కార్డులు కలిగిన వారికి బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయి. కాని కౌలు రైతులకు అందించే రుణాలు స్వల్పశాతమే అని చెబుతున్నారు. ఇక విద్యా రుణాలు, ఇళ్ళు నిర్మించుకోవటానికి రుణాలను బ్యాంకులు అందజేస్తున్నాయి. జాతీయ బ్యాంకులతో పాటు ప్రైవేటు సెక్టార్‌లో ఉన్న బ్యాంకులు కూడా రుణాలు అందజేయటం జరుగుతోంది. ఈ రకంగా పరిశీలిస్తే బ్యాంకులు ఇచ్చే రుణాలతో పాటు ఇతర మార్గాల ద్వారా కూడా ప్రైవేటు అప్పులు ఎక్కువగా చేయాల్సి వస్తోంది.

జీవితంలో రుణం ఒక భాగం

జీవితంలో రుణం తీసుకోవటం ఒక భాగంగా తయారైంది. ప్రతి వారు ఏదో ఒక అవసరానికి రుణాలు తీసుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా ఆరోగ్య పరంగా వచ్చే సమస్యల కోసం ప్రతి ఇంట్లో రుణాలు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. చదువులు ప్రస్తుతం పెను భారంగా మారాయి. ప్రైవేటు స్కూల్స్, కళాశాలల్లో ఫీజుల మోతతో ప్రతి కుటుంబంలో అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఉద్యోగస్తులు కూడా తమకు నెల వారీ జీతాలు వస్తున్నా అసవరాలకు అనుగుణంగా అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈ రకంగా పరిశీలిస్తే ప్రతి వారికి రుణభారం పెరుగుతోందని సర్వేలు చెబుతున్నాయి. అవసరాలకు మించి అప్పులు చేస్తుండటంతో కొన్ని కుటుంబాల్లో జీవితం అస్తవ్యస్తం అయ్యే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. వివిధ అవసరాలకు బ్యాంకులలో అప్పులు తీసుకున్నా అవి సరిపోక ప్రైవేటు అప్పులు చేసే వారు కొందరుంటున్నారు. ఈ రకంగా ప్రతి కుటుంబంలో రుణ భారం రోజురోజుకు పెరిగిపోతోంది. ఎంత ఆదాయం వచ్చినా పెరుగుతున్న నిత్యావసర ధరలకు రుణం చేయాల్సిన పరిస్థితులు గోచరిస్తు న్నాయి. కొంత మంది తాము తీసుకున్న రుణాలు చెల్లించలేక అవమాన భారం పడాల్సి వస్తోంది. ఇక ఫైనాన్స్‌ల వద్ద అప్పులు తీసుకున్న వారి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ప్రభుత్వం ఎన్ని రకాలుగా సంక్షేమ కార్య క్రమాలు నిర్వహించి ప్రజలను ఆదుకుంటున్నా మధ్య తరగతి కుటుంబాల వారికి ఇబ్బందులు తప్పటం లేదు. రాబోయే రోజుల్లో పరిస్థితులు ఎలా ఉంటాయో అన్న ప్రశ్న సర్వత్రా వినవస్తోంది.

కొండలరావుపాలెంలో హై టెన్షన్

- చేపల చెరువుల సొమ్ము కోసం గ్రామస్థుల పట్టు
- మాజీ ఎమ్మెల్యే ఇంటి వద్ద భారీగా పోలీసుల మొహరింపు



పెదవేగి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :పెదవేగి మండలం కొండలరావుపాలెంలో శుక్రవారం ఉదయం నుంచి హైటెన్షన్ వాతావరణం నెలకొంది. కొండలరావుపాలెంలోని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఇంటికి కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్థులు వస్తున్నారనే సమాచారంతో జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ ఆదేశాలతో నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో నలుగురు ఎస్‌ఐలు, 45 మంది పోలీస్ సిబ్బందితో శుక్రవారం ఉదయం కొండలరావుపాలెం చేరుకుని ఘర్షణలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. కోమటిలంక, శ్రీపర్రు గ్రామాలకు చెందిన సుమారు 50 మంది అబ్బయ్యచౌదరి ఇంటికి చేరుకున్నారు. అయితే అబ్బయ్య చౌదరి, ఆయన తండ్రి రామచంద్రరావు ఇద్దరూ లేకపోవడంతో వారంతా సాయంత్రం 4 గంటల వరకు వేచి చూసి నిరాశగా వెనుతిరిగారు. కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్థుల వివరాల ప్రకారం దెందులూరు నియోజకవర్గం పరిధిలోను, ఏలూరు రూరల్ మండలం పరిధిలోను ఆ రెండు గ్రామాలకు సంబంధించి చేపల చెరువుల సొమ్మును అప్పటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అధికార దర్పంతో గ్రామస్థులకు ఇవ్వకుండా తన వద్దే ఉంచుకున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు అడిగినా దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారని, ఇప్పుడు అబ్బయ్య చౌదరి లండన్‌కు, ఆయన తండ్రి హైదరాబాద్‌కు మకాం మార్చి సొమ్ము ఇవ్వకుండా తమను ఏమార్చాలని చూస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేపల చెరువుల సొమ్ము మొత్తం రూ.6 కోట్లని వారు చెప్తున్నారు.

మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రత్యేక చర్యలు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



నిడదవోలు పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్

నిడదవోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నామని ఏలూరు రేంజ్ ఐజీ జి.అశోక్‌కుమార్ అన్నారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ తల్లిని శుక్రవారం ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం, పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం నిడదవోలు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్‌కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక గస్తీని పెంచడంతో పాటు యువతకు కళాలశాల్లో కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేకంగా తూర్పు గోదావరి జిల్లా ఏజెన్సీని ఆనుకుని ఉండడంతో గంజాయిపై ప్రత్యేక దృష్టి సారించి నిఘా పెట్టామని అన్నారు. మరో పక్క ఒరిస్సా, వైజాగ్, ఏఎస్ఆర్ జిల్లాల పోలీస్ అధికారులు సమన్వయంతో గంజాయి రవాణాను నివారించేందుకు ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. అడిషనల్ ఎస్పీ ఎన్‌వీ మురళీకృష్ణ, డీఎస్పీ దేవకుమార్, సీఐ తిలక్, ఎస్‌ఐలు శోభన్‌కుమార్, సతీష్ పాల్గొన్నారు.

బూరుగుపల్లికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డును అందుకుంటున్న బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ

తాడేపల్లిగూడెం అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శశి విద్యాసంస్థల అధినేత బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్ హైటెక్స్‌లో జరిగిన ఈటీ టెక్‌ఎక్స్ -2024 5వ ఎడిషన్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డును అందించారు. రామన్ మెగసెసె అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చుక్, అపూస్మా ఏపీ శాఖ అధ్యక్షులు ఎంవీ రామచంద్రారెడ్డి, బ్రెయినీ ఫీడ్ ఎడ్యుకేషన్ మ్యాగజైన్ ఎడిటర్ కాకాని బ్రహ్మయ్య చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలోని ప్రముఖ విద్యాసంస్థల అధినేతలు పాల్గొన్నారు.

దూబచర్ల డైట్ కళాశాలలో కళా ఉత్సవ్ పోటీలు



విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందించిన ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

నల్లజర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం దూబచర్ల డైట్ కళాశాలలో కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు ఉన్నత పాఠశాలల నుంచి 19మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. శాస్త్రీయ నృత్యం విభాగంలో తాడేపల్లిగూడేనికి చెందిన టీఎస్ఎం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని వెంకటేశ్వరి ప్రథమ స్థానం సాధించగా, శాస్త్రీయ సంగీత విభాగంలో తణుకు పట్టణానికి చెందిన ఎస్ఎఫ్ఎస్ జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఏలూరిపాటి మహతి ప్రథమ స్థానం సాధించింది. బృంద నృత్యాల విభాగంలో ఏలూరుకు చెందిన కేజీఎం జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు చెప్పారు. విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు.

అభీష్టం మేరకే హెచ్‌ఎంలకు శిక్షణ తరగతులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో రెసిడెన్షియల్ పద్ధతిన విడతలవారీగా నిర్వహిస్తోన్న లీడర్‌షిప్ శిక్షణ తరగతుల్లో కీలకమార్పులు చేశారు. శిక్షణకు ఎంపికైన హెచ్‌ఎంలలో ఎవరికైనా రెసిడెన్షియల్ విధానంవద్దంటే వారి అభీష్టంమేరకు నాన్-రెసిడెన్షియల్ పద్ధతిని వర్తింపజేయాలని తాజాగా ఆదేశాలు వెలువడ్డాయి. అయితే నాన్-రెసిడెన్షియల్ విధానాన్ని ఎంచుకున్న హెచ్‌ఎంలు, టీచర్లు ఆయా ప్రాంతాల్లో రోజువారీగా నిర్దేశిత వేళకు ఖచ్చితంగా శిక్షణకు హాజరు కావాలి. అలాగే శిక్షణ కేంద్రాలను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఆ ప్రకారం జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం డివిజన్ల హెచ్‌ఎంలకు కొత్తగా భీమవరంలోని డిల్లీ పబ్లిక్‌స్కూలును శిక్షణ కేంద్రంగా ఎంపిక చేశారు. నూజివీడు డివిజన్ వారికి ఆగిరిపల్లిలో ప్రస్తు తం శిక్షణనిస్తోన్న హీల్ ప్యారడైజ్ స్కూలునే కొనసాగిస్తారు. ఈ నెల 9నుంచి నాల్గవ విడత, ఆ తదుపరి సోమవారం నుంచి చివరివిడత శిక్షణ తరగతులతో జిల్లాలోని హెచ్‌ఎంలందరికీ ట్రైనింగ్ క్లాసులు ముగుస్తాయి. కాగా లీడర్‌షిప్ ట్రైనింగ్‌కు హాజరైన హెచ్‌ఎంలలో ఇప్పటికే ఇద్దరు హెచ్‌ఎంలు శిక్షణకేంద్రాల్లోనే మృతి చెందిన సందర్భంలో నాన్-రెసిడెన్షియల్ పద్ధతిన జిల్లాకేంద్రంలోనే శిక్షణ తరగతులు నిర్వహించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్‌రాజు, జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర డిమాండ్ చేశారు. వీరికి నాన్-రెసిడెన్షియల్ పద్ధతిన శిక్షణకు అభీష్టాన్ని ఎంచుకునే వీలుకల్పించినప్పటికీ రోజూ వెళ్ళి రావడానికి అనుకూలంకాదని, అధికారులు పునరాలోచన చేయాలని కోరారు.



సర్టిఫికెట్లు సాధించిన ఎన్‌సీసీ విద్యార్థులు

స్వర్ణాంధ్రలో ముగిసిన ఎన్‌సీసీ శిబిరం

నరసాపురం రూరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): పది రోజులుగా మండలంలోని స్వర్ణాంధ్ర కాలేజీలో 7ఆంధ్రా నేవెల్ యూనిట్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాంపు శుక్రవారంతో ముగిసింది. చివరి రోజున పలు విభాగాల్లో శిక్షణ పూర్తి చేసిన కేడెట్‌లకు క్యాంపు కమాండర్ కెప్టెన్ వైపీపీ ప్రదీప్, డిప్యూటీ క్యాంపు కమాండర్ లెఫ్టినెంట్ సంజీత్ రౌత్రే సర్టిఫికెట్లు అందించారు. అనంతరం కమాండర్లు మాట్లాడుతూ క్రమశిక్షణ, నాయకత్వం, సామాజిక సేవా కార్యక్రమాల్లో కేడెట్‌లు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఏఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేవల్ యూనిట్

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఊఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ (అటానమస్)కళాశాలలకు ఎన్‌సీసీ నేవల్ యూనిట్ మంజూరైంది. ఈ విషయాన్ని శుక్రవారం జరిగిన ఎన్‌సీసీ అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్‌సీసీ 7 ఆంధ్రా నేవెల్ యూనిట్, నరసాపురం వైఎన్ కళాశాల ఇన్‌చార్జి కమాండ్ ఆఫీసర్ సంజీత్ రౌత్రే తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి, శారీర సౌష్టవం, ఐక్యత పెంపొందుతాయని, కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలలో (ఆర్మీ, పోలీస్ విభాగాల్లో) ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఈసందర్భంగా 50 మంది విద్యార్థులకు రాత, ఫిజికల్ పరీక్షలు నిర్వహించారు. వారిలో ఇంటర్వ్యూలు అనంతరం 17మందిని ఎంపిక చేశారు.

క్రైమ్ కార్నర్

మహిళను కాపాడిన పోలీసులు



పాతబస్టాండ్‌లో వివాహి తను గుర్తించిన కానిస్టేబుల్

ఏలూరు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అన్నవరానికి చెందిన వెంకటేష్ ఈనెల 5వ తేదీ రాత్రి 7.36 గంటలకు 112 కు కాల్ చేశాడు. తన భార్య బత్తుల త్రివేణి తనతో 5వ తేదీ మధ్యాహ్నం గొడవ పడి ఇంటి నుంచి వెళ్ళిపోయిందని రాత్రి వేళ ఏలూరు పాతబస్టాండ్ నుంచి తనకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుని చనిపోతానని చెప్పిందని సమాచారం అందించాడు. దీంతో 112 కాల్ సెంటర్ వెంటనే ఏలూరు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వైవి రమణ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ వెంటనే ఏలూరు పాత బస్టాండ్ వద్దకు వెళ్ళి ఆమెను గుర్తించి స్టేషన్‌కు తీసుకువచ్చారు. పోలీసు అధికారులు ఆమెకు కౌన్సెలింగ్ చేసి బంధువులకు అప్పగించారు. సకాలంలో స్పందించి ఆమెను కాపాడిన పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బంధన్ బ్యాంకు వద్ద ఖాతాదారుల ఆందోళన

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలో బంధన్ బ్యాంకు వద్ద శుక్రవారం రాత్రి తమ సొమ్ము స్వాహా చేశారంటూ ఖాతాదారులు ఆందోళనకు దిగారు. తమకు రుణాలు ఇచ్చినట్టు చూపి సుమారు రూ.60లక్షల వరకు స్వాహాచేసినట్టు ఆరోపించారు. ఈ క్రమంలో మేనేజర్‌ను లోపల నిర్బంధించి ఆందోళన చేపట్టారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి మేనేజర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. దీనిపై పట్టణ సీఐ సుబ్రహ్మణ్యంను సంప్రదించగా ఈ గొడవ జరుగుతున్నట్టు ఫిర్యాదు రావడంతో అక్కడ ఎలాంటి సమస్య తలెత్తకుండా ఖాతాదారులకు సర్దిచెప్పామని ఈ విషయంపై దర్యాప్తు చేస్తామన్నారు.

కోడి పందేలపై మెరుపుదాడి

- తెల్లవారుజామున మూడు మండలాల పోలీసుల జాయింట్ ఆపరేషన్
- రూ.3.31లక్షల నగదు, 23 కోళ్లు, 28 బైక్‌లు స్వాధీనం
- 16 మంది అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లు

నరసాపురం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాత నవరసపురం గ్రామంలో కోడి పందేలపై మొగల్తూరు, నరసాపురం, యలమంచిలి పోలీసులు దాడి చేశారు. 16 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3.31లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. 23 కోళ్లు, 28 బైక్‌లు, కారు, 17 సెల్‌ఫోన్లు, కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. దాడులకు సంబంధించి సర్కిల్ కార్యాలయంలో నరసాపురం, పాలకొల్లు సీఐలు దుర్గాప్రసాద్, జి.శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు మండలాల పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించామని తెలిపారు. తెల్లవారుజామున 3గంటల సమయంలో నవరసపురం గ్రామంలో శిబిరం నిర్వహిస్తు న్నారన్న సమాచారంతో మెరు పు దాడి చేశామన్నారు. చాలా మంది తప్పించుకుని చీకట్లో పారిపోయారన్నారు. సమావేశంలో ఎస్సై గురవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పందెం నిర్వాహకులు ఎవరు.?

మరోవైపు పోలీసుల మెరుపుదాడి తీరలో చర్చనీయాంశమైంది. కొంత కాలంగా నరసాపురం, మొగల్తూరు, కృష్ణా, భీమవరం మండలాల సరిహద్దుల్లో రాత్రి సమయాల్లో పెద్ద ఎత్తున పందెలు నిర్వహిస్తున్నారన్న వదంతలు షికారు చేస్తున్నాయి. వ్యాన్‌కు ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసి వాటి సాయంతో ఎంచుకున్న ప్రదేశాల్లో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ముందుగానే పందెంరాయుళ్ళకు సమాచారాన్ని తెలియజేస్తున్నారు. రెండు మూడు గంటల పాటు జరిగే ఈ పందాలు లక్షలు చేతులు మారుతున్నాయి. తాజాగా పోలీసుల దాడుల్లో కూడా ఇదే వెలుగుచూసింది. అయితే ఈ పందేనికి నిర్వాహకులు ఎవరన్న దానిపై పలు పేర్లు షికారు చేస్తున్నాయి. కూటమి పార్టీకి చెందిన ఓ ముఖ్య నాయకుడు బంధువు తెర వెనుక ఉండి చట్టవిరుద్ధ కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్న వాదనలు లేకపోలేదు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కోళ్లు

ఆక్టోపస్ మాక్‌డ్రిల్

పోలవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో ఏపీ ఆక్టోపస్ పోలీసులు శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద దాడి జరిగినప్పుడు, అసాంఘిక శక్తులు విజృంభించినప్పుడు భద్రతా బలగాల సంసిద్ధతను పరీక్షించే లక్ష్యంతో జరిగిన ఈ కసరత్తు ఆక్టోపస్ సీనియర్ పోలీస్ అధికారుల పర్యవేక్షణలో జరిగింది. స్థానిక పోలీసులు, ప్రాజెక్ట్ భద్రతను పర్యవేక్షిస్తున్న ఎంఈఐఎల్ సిబ్బంది సహకారంతో ఈ డ్రిల్ నిర్వహించారు. పోలవరం ప్రాజెక్ట్ వంటి భారీ నిర్మాణాలను ఉగ్రవాదులు, అసాంఘిక శక్తులు లక్ష్యంగా చేసుకున్నప్పుడు స్పందించడంతో పాటు వారిని సమర్థంగా తమ శక్తిసామర్థ్యాలు, ఆయుధసంపత్తితో వ్యూహాత్మకంగా ఎలా ఎదుర్కొంటారో ఈ మాక్‌డ్రిల్‌లో ఆక్టోపస్ పోలీస్‌లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆక్టోపస్ విభాగం డీఎస్పీ తిరుపతి మాట్లాడుతూ ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు ఆక్టోపస్ పోలీసులు సంసిద్ధతను అంచనా వేసేందుకు మాక్‌డ్రిల్ జరిపామన్నారు. ఇది నిరంతరం కొనసాగుతుందన్నారు. తమ సన్నద్ధతను మెరుగుపర్చడంతో పాటు మరింత వేగంగా ప్రతిస్పందించడం కోసం కృషి చేస్తున్నామన్నారు.

వడలిలో తాటాకిల్లు దగ్ధం



పెనుగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వడలి గ్రామంలో పడాల విష్ణుకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. విష్ణు తల్లి లక్ష్మి ఇటీవల మృతి చెందడంతో కుమారుడు ఇల్లు విడిచి వేరొక ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. అయితే ఇల్లు ఏ విధంగా ప్రమాదానికి గురైంది అనే విషయం మాత్రం ఎవరికి తెలియడం లేదు. తాటి ఆకుల ఇల్లు చాలా పెద్దది అని 15 అడుగుల వెడల్పు గల ఇటుకలతో నిర్మించి ఉన్న ఇల్లు అని చుట్టు పక్కల వారు చెబుతున్నారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు

ఆరు బైక్‌లు స్వాధీనం



పాలకోడేరు, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): బైక్‌లు దొంగతనం చేసే వ్యక్తి వద్ద నుంచి రూ.5 లక్షల 55 వేల విలువ చేసే ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పాలకోడేరు పోలీసులు తెలిపారు. కోరుకొల్లు గ్రామానికి చెందిన జీగ తేజ కొంత కాలంగా బైక్‌లు దొంగతనం చేస్తూ నేరస్తుడిగా ఉన్నాడు. ఇతనిపై గతంలోనే కేసులు ఉన్నాయన్నారు. మళ్ళీ ఇతను ఆరు బైక్‌లు దొంగతనానికి పాల్పడ్డాడని సమాచారం తెలియడంతో కోరుకొల్లు గ్రామం వెళ్ళి అతనిని ఎస్ఐ రవివర్మ అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

జాబ్‌మేళా స్క్రీనింగ్ టెస్టుకు 201 మంది హాజరు

చింతలపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక లయన్స్ క్లబ్‌లో శుక్రవారం జాబ్‌మేళాకు ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్క్రీనింగ్ మాక్ టెస్ట్‌కు 201 మంది అభ్యర్థులు హాజరయ్యారు. నియోజకవర్గంలోని జంగారెడ్డిగూడెం, చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట మండలాల్లో నాలుగు రోజులపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ స్వయంగా జాబ్‌మేళా ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ఎంపికైన వారికి మాక్ టెస్ట్‌కు సంబంధించి 201 మంది హాజరయ్యారు. త్వరలోనే ఫైనల్ జాబితా విడుదల చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

మినీ బైపాస్ రోడ్డు పనులు ప్రారంభం

ద్వారకాతిరుమల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలో మినీ బైపాస్ రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గరుడాళ్వార్ కూడలి నుంచి పాత సూపర్ బజార్ వరకూ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో గరుడాళ్వార్ సెంటర్ బస్టాండ్, కామవరపుకోట వైపు వాహనాలు, ఆర్టీసీ బస్సుల దారి మళ్లించారు. వెంకటకృష్ణాపురం దారిలో తహసీల్దారు కార్యాలయం, పోలీస్‌స్టేషన్ మీదుగా బస్టాండ్‌కు వెళ్లేలా పోలీసులు చర్యలు చేపట్టారు.

రేపు భగవద్గీత కంఠస్థ పోటీలు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హిందూ ప్రచార పరిషత్, టీటీడీ ఆధ్వర్యంలో ఈ నెల 8న భగవద్గీత కంఠస్థ పోటీలను స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్నట్టు హిందూ ప్రచార పరిషత్ సభ్యుడు తోట రామకృష్ణ తెలిపారు. 6 నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి

ఉంగుటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆలయాల రక్షణ కోసం హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ జాతీయ లీగల్ సెల్ కోర్ కమిటీ సభ్యులు గొల్లపూడి శ్యాం ప్రసాద్ ముఖర్జీ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గోపీనాథపట్నంలో జరిగిన సభలో సత్యానంద గిరి స్వామీజీ మాట్లాడుతూ ఆలయాల పరిరక్షణకు జనవరి 5న జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ ఉంగుటూరు ఖండ కార్యవాహ్ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీగా చింతమనేని రమేష్



ఏలూరు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది చింతమనేని రమేష్‌ను ఏలూరులోని రెండో అదనపు జిల్లా సెషన్స్‌కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా రెండో పర్యాయం ప్రస్తుతం పదవిలో కొనసాగుతున్నారు. ఆయన మూడేళ్ళపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం

చింతలపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడికి చెందిన గోల్కొండ నీలిమ అనే బీకాం విద్యార్థినికి చింతలపూడి రాయల్ క్లబ్ రూ. 15 వేలు ఆర్థిక సాయం అందించింది. సంఘ వ్యవస్థాపకులు చిక్కాల నాగేశ్వరరావు మాట్లాడుతూ భువనేశ్వర్‌లో జరిగే జాతీయ పోటీల్లో డిస్కస్‌త్రో జూనియర్ విభాగంలో పాల్గొనడానికి వెళ్తున్న ఈ క్రీడాకారిణికి ఆర్థిక సహాయం అందించినట్టు ఆయన తెలిపారు. అధ్యక్షులు సుబ్బారావు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్య శిబిరం

బుట్టాయగూడెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విప్పలపాడులోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్లో అంతర్వేదిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టరు మాధురి శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటుచేసి పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. మొత్తం 378 మంది విద్యార్థులుండగా 344 మందికి వైద్యపరీక్షలు చేయగా 54 మంది చర్మవ్యాధులు, నలుగురు సాధారణ జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించి మందులు పంపిణీ చేశారు. బాలురు, బాలికలు నివాసం ఉంటున్న గదుల్లో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వి.పెద్దిరాజు ఆధ్వర్యంలో ఇండోర్ స్పేస్ స్ప్రేయింగ్ చేయించారు. దోమల నిర్మూలనకు తీసుకోవలసిన చర్యలను ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ మిశ్రాకు వివరించారు. సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఎంపీహెచ్ఈవో ఎస్.శ్రీనివాస్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకతాయిలు వేధిస్తే 112కు కాల్ చేయండి

ఏలూరు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే వెంటనే 112కు కాల్ చేయాలని, పది నిముషాల్లోపు అభయ రక్షక మహిళాదళం వస్తుందని ఏలూరు మహిళా స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. సుబ్బారావు చెప్పారు. ఏలూరు కొత్తబస్టాండ్‌లో శుక్రవారం సాయంత్రం విద్యార్థులకు అభయ రక్షకదళంపై అవగాహనను సీఐ తన సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఏదైనా ప్రమాద సూచికలు గమనించినా వెంటనే 112కు సమాచారం అందించాలని సూచించారు.

మహిళా కళాశాలలో సాంస్కృతిక ప్రదర్శనలు

పెదపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు మండలం వట్లూరులోని సర్ సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో సాంస్కృతిక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మెహందీ, కేశాలంకరణ పోటీలు నిర్వహించారు. మెహందీలో ఆర్.సౌమ్యశ్రీ, ఎస్.కె.సుల్తానా, ఎస్. మీనాక్షి, కేశాలంకరణలో ఎస్.సింధు, టి.మీనాక్షిత, ఎ.దుర్గ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుపొందారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చంటి

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

»వర్ధంతి కార్యక్రమాల్లో వక్తల పిలుపు » ఘనంగా నివాళులు

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్ళడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. నవాబుపేటలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి అంజనేయులు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉప సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, మాజీ డిప్యూటీ మేయర్ సుధీర్‌బాబు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. శ్రీరామ్‌నగర్ ఎంపీ యూపీ పాఠశాలలో భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర కార్యదర్శి బేతాళ నాగరాజు, ఎస్సీ, ఎస్టీ బహుజన్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో సొసైటీ అధ్యక్షులు ఎం.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏలూరు క్రైం: ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న బార్ అసోసియేషన్ భవనంలో ఏలూరు బార్ అధ్యక్షుడు, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. సీతారామ్ అధ్యక్షతన ఘన నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి రత్నరాజు, జనరల్ సెక్రటరీ పి. తిరుపతిస్వామి, మాజీ ప్రెసిడెంట్ రాజబాబు నివాళులర్పించారు.

ఏలూరు రూరల్: శుక్రవారం ఆర్టీసీ విజయవాడ జోన్ చైర్మన్, జనసేన ఏలూరు ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు స్థానిక పాత బస్టాండ్ సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అణగారిన వర్గాల సాధికారతకు విశేష కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామంజనేయ చౌదరి అన్నారు. ఏలూరు జిల్లా కార్యాలయంలో శుక్రవారం అంబేడ్కర్ చిత్రపటానికి గారపాటి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ రాంబాబు పాల్గొన్నారు.

లింగపాలెం: అంబేడ్కర్ ఆశయ బాటలో నడవాలని తహసీల్దార్ నజీముల్లాషా అన్నారు. ఎమ్మార్వో కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కామవరపుకోట: వీరభద్రకాలనీలో గల అంబేడ్కర్ విగ్రహానికి సీపీఐ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ద్వారకాతిరుమల: అంబేడ్కర్ విగ్రహానికి జై భీమ్ సేవాసంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. బహుజనుల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని ప్రశంసించారు.

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బోడపాటి వెంకటేశ్వరరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు పాల్గొన్నారు. ఎంఆర్పీఎస్, ఎంపీఎస్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి విస్సంపల్లి సిద్దు మాదిగ పూలమాల వేసి నివాళులర్పించారు. మాలమహానాడు ఆధ్వర్యంలో సంఘ నాయకుడు తొర్లపాటి శ్రీనివాసరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంఘ జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్ సీఎస్ఐ స్కూల్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చింతలపూడి: కూటమి ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నాయకుడు బోడా అనీష్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి యువజన నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కలకుర్తి నాగేశ్వరరావు, రిటైర్డ్ అదనపు డీజీపీ పూరేటి విజయానంద్ పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బలుసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: అంబేడ్కర్ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని జీలుగుమిల్లి అంబేడ్కర్ యూత్ సభ్యులు పేర్కొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

టి.నరసాపురం: బొర్రంపాలెం ప్రధాన సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి అంబేడ్కర్ యువత పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్పీ హైస్కూల్లో, ఎంపీపీ స్కూల్లో టీచర్స్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. టి.నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వృద్ధులకు, తహసీల్దార్ సాయిబాబా, ఎస్సై ఎం.జయబాబు, వైద్యాధికారి ఫణీంద్రబాబు చేతులమీదుగా పండ్లు పంపిణీ చేశారు.

పోలవరం: పోలవరం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సాయిరాజు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యడ్లగూడెం సెంటర్‌లో సీఐటీయూ నాయకులు వారా నాని, అక్కాబత్తుల రాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

కుక్కునూరు: మండలంలో పలుచోట్ల అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలకు అంబేడ్కర్ దైవమన్నారు. వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంచారు.



వంతెన నిర్మాణం వద్ద రైతులతో మాట్లాతున్న అధికారులు, కాంట్రాక్టర్

వంతెన నిర్మాణాన్ని అడ్డుకున్న రైతులు

దెందులూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గుండుగొలను శింగగూడెం వద్ద బ్రిటిష్ కాలం నాటి వంతెన రెండేళ్ల క్రితం కూలిపోగా యుద్ధ ప్రాతిపదికన వంతెన మంజూరైంది. అయితే కాంట్రాక్టర్ నిర్మాణం పూర్తి చేయలేదు. ఇప్పుడు వరి నారుమడులు పోసిన తరువాత గోదావరి కాల్వలో సాగునీటికి ఇబ్బందులు లేకుండా భారీ తూరలు ఏర్పాటు చేసి పనులు చేయవల్సి ఉండగా కాంట్రాక్టరు గోదావరి కాల్వలో చిన్న తూరలను శుక్రవారం ఏర్పాటు చేస్తుండగా గుండుగొలనుతో పాటు 10 గ్రామాల రైతులు సుమారు 30 వేల ఎకరాలకు సాగునీరు చిన్న తూరలు గుండా వెళ్లడం సాధ్యం కాదని దీనివల్ల సాగునీరు అందదని రైతులు వంతెన నిర్మాణ పనుల వద్దకు చేరుకుని పనులు నిలిపి వేయాలంటూ ఆందోళనకు దిగారు. ఇరిగేషన్ డీఈ నాగార్జున, ఏఈ వంతెన వద్దకు చేరుకుని రైతులతో చర్చలు జరిపినా ఫలితం లేక పోవ డంతో వారు ఇరిగేషన్ ఎస్ఈ చిలకపాటి దేవ ప్రకాష్‌కు సమాచారం ఇవ్వగా ఆయన రైతులను బుజ్జగించినా వారు ససేమిరా అనడంతో తాత్కాలికంగా పనులను నిలుపుదల చేశారు. ఆందోళనకారులు మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని సాగునీటికి ఇబ్బందులు లేకుండా పెద్ద తూరలను ఏర్పాటు చేసి వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు,

8న ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

చింతలపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రగడవరంలో ఈ నెల 8న అపుస్మా, మానవత, స్టెప్ సంస్థల ఆధ్వర్యంలో ప్రైవేటు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు అపుస్మా జిల్లా అధ్యక్షుడు ఎం.శివకుమార్‌శర్మ తెలిపారు. తరగతులకు ప్రముఖ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, స్టెప్ కార్యదర్శి ధర్మారెడ్డి, అపుస్మా జిల్లా కో-ఆర్డినేటర్ కోనేరు సురేష్, మానవత జిల్లా విద్యానిధి చైర్మన్ అలపాటి నాగేశ్వరరావు, జోన్ అధ్యక్షులు పి.రాంబాబు ముఖ్య అతిధులుగా పాల్గొంటారని, ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

120 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

టి.నరసాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెడ్లంలో టీడీపీ మండల నాయకుడు బండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏలూరు శంకర నేత్ర వైద్యాలయ సిబ్బంది ఉచిత నేత్ర వైద్య శిబిరంను నిర్వహించారు. 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 52 మందికి కళ్ళజోళ్ళు అందచేశారు. 18మందికి కంటి ఆపరేషన్లు అవసరమవుతాయని తెలిపారు.

సీఐటీయూలో చేరిన పలువురు మాతృ సంస్థలోకి..

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏఐటీయూసీ నుంచి సీఐటీయూకు వెళ్ళిన స్థానిక ఏరియా ఆసుపత్రి పారిశుద్య కార్మికులు తిరిగి మాతృసంస్థ ఏఐటీయూసీలో చేరినట్లు ఆ సంఘ నాయకులు జంపన వెంకట రమణ రాజు, కూనపాముల విఘ్నేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'వేలాది మందిని సురక్షితంగా తీసుకొచ్చాం'

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గడచిన ఐదేళ్ళలో ఆఫ్ఘనిస్తాన్, ఉక్రెయిన్, సూడాన్, ఇజ్రాయిల్, హైతీ దేశాల్లో జరుగుతున్న యుద్ధాల్లో చిక్కుకుపోయిన వేలాది మందిని సురక్షితంగా మనదేశానికి తరలించినట్లు కేంద్ర విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ లోక్‌సభలో ప్రకటించారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ లోక్‌సభలో అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. యుద్ధప్రాంతాల్లో చిక్కుకున్న వారిని తరలించడానికి రూ. 181 కోట్లు భారత ప్రభుత్వం ఖర్చు చేసిందని మంత్రి తెలిపారు. విదేశాల్లో ఉన్న భారతీయులను ఎప్పటికప్పుడు సంప్రదించడానికి వీలుగా హెల్ప్‌లైన్ నెంబర్లు అందుబాటులో ఉంచామని, ఆపరేషన్ గంగ కార్యక్రమంలో భాగంగా ఉక్రెయిన్ నుంచి 682 మంది, ఆపరేషన్ కావేరిలో భాగంగా సూడాన్ నుంచి 106 మందిని, ఆపరేషన్ అజయ్‌లో భాగంగా ఇజ్రాయిల్ నుంచి 45 మందిని రాష్ట్రానికి సురక్షితంగా తరలించామన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

ద్వారకాతిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జీటీవీ.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా షేక్ షబ్బీర్, ప్రధాన కార్యదర్శిగా డి. బాలామణి, కోశాధికారిగా ఎస్.హరికృష్ణ ఎన్నికయ్యారు. సభ్యులుగా వి. ఫణిరాజ్ కుమారి, ఆర్ సప్తగిరి, పి సాయిచంద్, కెపి రహీమ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈవోపీఆర్‌డీ ఏవి సుబ్బరాయన్ తెలిపారు.

సైబర్ నేరాల నియంత్రణకు సహకరించాలి

ఏలూరు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను సైబర్ నేరగాళ్ళు చాలా తెలివిగా మోసం చేస్తున్నారని ఇలాంటి వారి బారిన ప్రజలు పడకుండా విద్యార్థులు తమ చుట్టు పక్కల వారికి సైబర్ నేరాల నియంత్రణ కోసం అవగాహన కల్పించాలని ఏలూరు టూటౌన్ ఎస్ఐ నాగ కల్యాణి అన్నారు. జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో టూటౌన్ సీఐ వైవి రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగ కల్యాణి ఏలూరు అశోక్ నగర్‌లోని ఎస్‌పీడీబీటి కాలేజీలో విద్యార్థులకు అభయ మహిళా భద్రత అనే అంశం పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగ కల్యాణి మాట్లాడుతూ నేరగాళ్ళను అదుపు చేయడానికి అభయ మహిళారక్షక దళాన్ని ఎస్పీ ప్రవేశపెట్టారని వివరించారు. ఎవరైనా ఆపదలో ఉంటే 112కు కాల్ చేయాలని, బాల్య వివాహాలు ఎవరైనా జరపడానికి ప్రయత్నిస్తే 1098కు సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ నేరాలకు ఎవరైనా గురైతే వెంటనే 1930కు సమాచారం అందించాలన్నారు.



ఎంపికైన జట్టుతో నన్నయ యూనివర్సిటీ పరిశీలకుడు, ప్రిన్సిపాల్ తదితరులు

నన్నయ వర్సిటీ జట్టు ఎంపిక

ఏలూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల క్రీడాకారిణులకు అంతర్ కళాశాలల మహిళల బాస్కెట్ బాల్ టోర్నమెంట్ కం సెలక్షన్లు శుక్రవారం ముగిశాయి. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల క్రీడా మైదానంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఎంపికైన జట్టు వివరాలను వర్సిటీ ప్రతినిధి డాక్టర్ మూర్తి, సెలక్షన్ కమిటీ మెంబరు డాక్టర్ బాపిరెడ్డి వీరబాబు మీడియాకు విడుదల చేశారు. ఈ జట్టు కొట్టాయంలోని మహాత్మా గాంధీ వర్సిటీలో ఈ నెల 20 నుంచి 24 వరకు నిర్వహించనున్న దక్షిణమండలం అంతర్‌విశ్వవిద్యాలయాల మహిళల బాస్కెట్‌బాల్ టోర్నీకి నన్నయ విశ్వవిద్యాలయంనుంచి ప్రాతినిధ్యం వహిస్తుందని వివరించారు. యూనివర్శిటీ జట్టుకి ఎంపికైన వారిలో సెయింట్ థెరిస్సా కళాశాల క్రీడాకారిణులు అనిత, నాగదేవి, నాగవినయశ్రీ, జ్యోతి, లక్ష్మీప్రవల్లిక, ఝాన్సీదుర్గ, సాయిసుధ, పావని ప్రియ, రాజమండ్రి వీరవల్లి విద్యాసుందర కళాశాలకు చెందిన జాస్మిన్, దుర్గ, కాకినాడ ఐడియల్ కళాశాలకు చెందిన వైష్ణవి ఉన్నారు. సౌత్‌జోన్ టోర్నీకి ఎంపికైన జట్టుకి నన్నయ యూనివర్శిటీ కప్‌ను టోర్నీ పరిశీలకుడు మూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సెలీన్‌రోజ్ తదితరులు అందజేసి అభినందించారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదం: చింతమనేని

పెదవేగి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదపడతాయని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. జనసేన ఆధ్వర్యంలో పెదవేగి మండలం నడిపల్లిలో నిర్వహించనున్న జిల్లా స్థాయి మెగా వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాపోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేసిన జనసేన నాయకులను అభినందించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి ఘంట సాల వెంకటలక్ష్మి, బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ్ కిషోర్, కన్వీనర్ కట్నేని కృష్ణ ప్రసాద్, కృష్ణ చైతన్య, ఏలూరు ఎంపీపీ శ్రీనివాస రాజు, జనసేన పెదవేగి నాయకులు పాల్గొన్నారు.



ఆహ్వానం అందిస్తున్న మాదేపల్లి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు

రండి.. రండి.. రండి దయచేయండి

ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలకు ఆహ్వానాలు

ఏలూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నాడు మెగా పేరెంట్స్ మీటింగ్ జరిపేందుకు ఉపాధ్యాయులు ఆహ్వానం పలుకుతున్నారు. ఇందులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులకు ఆహ్వానాలను అందిస్తున్నారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, పీఆర్టీయు జిల్లా అధ్యక్షుడు పువ్వల ఆంజనేయులుతో పాటు మరికొంత మంది ఉపాధ్యాయులు పేరెంట్ కమిటీ చైర్మన్, విద్యార్థులు కలిసి సర్పంచ్‌లకు, విద్యార్థుల కుటుంబ సభ్యులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఓ వేదికపై చేర్చి విద్యాపరమైన అంశాలు చర్చించడంతో పాటు ఆటపాటలు, సహపంక్తి భోజనాలు, పిల్లల ప్రగతి నివేదికలు అందజేస్తామని ఎంఈవో రంగయ్య తెలిపారు.

పెదవేగి: విద్యార్థుల ఉన్నతికి పేరెంట్స్ మీటింగ్ దోహదపడుతుందని పెదవేగి ఎంఈవో-2 వి.అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి మండల పరిషత్ విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 75 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. అన్ని పాఠశాలల్లోనూ శనివారం మెగా టీచర్స్- పేరెంట్స్ సమావేశం ఏర్పాటు చేసి, విద్యార్థులు ఉన్నతి, పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ఔన్నత్యానికి ఉపయోగపడే ఇతర అంశాలపై చర్చిస్తామని, తల్లిదండ్రులు విధిగా హాజరై, విద్యార్థుల సంక్షేమం, పాఠశాలల అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దారు భ్రమరాంబ, ఎంపీడీవో పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.



స్లాబ్ మూత తీసి ఉంచిన దృశ్యం

ఎన్నాళ్లిలా..?

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్షన్‌లైన్‌లోని ముస్లింల కాలనీకి వెళ్ళే మార్గంలో డ్రెయినేజీపై పూడిక తీసేందుకుగాను దాదాపు రెండు నెలల క్రితం రోడ్డుకు మధ్య భాగంలోని స్లాబ్‌ను తొలగించి పూడిక తీశారు. అయితే తొలగించిన స్లాబ్‌ను తిరిగి యథాస్థానంలో అమర్చలేదు. దీంతో రోడ్డు మధ్య భాగంలో గొయ్యిలా ఉండి చిన్నాచితకా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా తొలగించిన స్లాబ్ మూతను యథాస్థానంలో ఉంచి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఉద్యోగుల రక్తదానం

ఏలూరు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ఆర్ఆర్‌పేటలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఏలూరు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 20 మంది బ్యాంకు ఉద్యోగులు రక్తదానం చేసినట్టు రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు. దంత వైద్యులు డాక్టర్ వంశీ, రెడ్‌క్రాస్ వైద్యులు డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాదరావు, హెచ్‌డీఎఫ్‌సి క్లస్టర్ హెడ్ కల్యాణ్ నరిస్, బ్రాంచ్ మేనేజర్ ఐనాల సత్య, పీఆర్వో రమణ తదితరులు పాల్గొన్నారు.

రచ్చబండను ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం,డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెం గ్రామంలో రచ్చబండ ను ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయ సూపరింటెంటెంట్ శేఖర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు మంద వెంకటేశ్వరరావు, బయ్యారం, విస్సంపల్లి సిద్దు, తుట్టి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

దెందులూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొన్న ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. కోరుకొల్లు పంచాయతీ పరిధిలోని బద్రికోడు గ్రామానికి చెందిన మంతెన రామరాజు అతని భార్య మోటార్ సైకిల్ మీద గుండుగొలను గ్రామం నుంచి తాత్కాలిక వంతెన దాటి భీమడోలు వైపు మోటార్ సైకిల్‌పై వస్తుండగా ఏలూరు వైపు నుంచి తాడేపల్లిగూడెం వైపుగా వస్తున్న కారు రోడ్డు నిర్మాణం కోసం మూసివేసిన రోడ్డు మీదుగా వేగంగా వచ్చి అదుపుతప్పి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ దంపతులను 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దెందులూరు ఎస్ఐ శివాజీ కేసు నమోదు చేశారు.

ట్యాంకర్ తగిలి ఒకరికి..

పోలవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పోలవరం కృష్ణారావుపేట వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనిచేస్తున్న ఆకుల శివకుమార్ శుక్రవారం వాటర్ ట్యాంకర్ తగిలి గాయాలపాలయ్యాడు. పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ పొడుం పుష్ప, మాజీ ఉప సర్పంచ్ మంగిన కొండ అతనిని పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు అతనిని మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి సిఫార్సు చేశారు.

సారా స్వాధీనం..

చింతలపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ పరిధిలో సారాపై దాడులు నిర్వహించగా సాయంపాలెం గ్రామానికి చెందిన బి.లక్ష్మీకాంతం అనే మహిళ నుంచి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు.

పల్లకిలో ఊరేగిన సుబ్బారాయుడు

వైభవంగా షష్టి ఉత్సవాలు



ద్వారకాతిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడు పల్లకి వాహనంలో క్షేత్రపురవీధుల్లో ఊరేగారు. శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. స్వామివారి కల్యాణం శనివారం రాత్రి 8 గంటల నుంచి ప్రారంభమవుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

చింతలపూడి: నాగిరెడ్డిగూడెంలో శనివారం షష్టి కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున 4.30 గంటల నుంచి కుజ, రాహు, కేతు, కాల సర్ప దోషముల నివారణకు అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.20 గంటలకు కళ్యాణం నిర్వహిస్తారు. అనంతరం అన్నసమారాధనకు ఏర్పాట్లు చేశారు. 8న కల్యాణమూర్తుల గ్రామోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.

జీలుగుమిల్లి: షష్టిని పురస్కరించుకుని జీలుగుమిల్లిలో శ్రీవల్లీ దేవసేన సుబ్రమణ్యస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి జరిగింది. అర్చకులు టిఎస్.రామకృష్ణశర్మ, రవిశర్మ, సర్వేశ్వరశర్మ పది మంది దంపతులచే శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం జరిపించారు. 10వ తేదీ వరకు షష్టి ఉత్సవాలు జరుపుతున్నారు. ప్రతిరోజూ ఉదయం సాయంత్రం కుంకుమార్చనలు ప్రత్యేక అలంకరణలు జరుపుతున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నేడు భారీ అన్న సమారాధన

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కైకరంలో వెలసిన శ్రీ వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి 90వ ఉత్సవాలలో భాగంగా తొలి రోజు శనివారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ వివరించింది. శుక్రవారం నాడు ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీటీసీ చింతల శ్రీనివాస్, పామర్తి సత్తిబాబు, యెగ్గిన పెదబాబు తదితరులు మాట్లాడుతూ షష్టి ఉత్సవాలకు వేలాది మంది భక్తులు హాజరవుతారని వారందరినీ గౌరవించి రాజకీయాలకు అతీతంగా షష్టి కమిటీకి సహకరించాలని కోరారు.





కనబడని కెమెరా కన్ను

» నగరం, పట్టణాల్లో పనిచేయని సీసీ కెమెరాలు

» ఏలూరులో కొంత మెరుగు

కనబడని నాలుగో సింహం పోలీస్ అయితే.. ఆ సింహానికి మరో కన్ను సీసీ కెమెరా.. ప్రస్తుత ఆధునిక సాంకేతిక ప్రపంచంలో నేరస్థుల కదలికలు పసిగట్టి నేరాలు నియంత్రించడంలో సీసీ కెమెరా సమర్థవంతమైన సాధనం. ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా ఇది గుర్తించారు. నగరం, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు, ప్రధాన రహదారుల్లో వీటిని ఏర్పాటు చేయడంతో నేరస్థులు వెనక్కి తగ్గారు. వ్యాపారుల దుకాణాలతో పాటు, అపార్ట్‌మెంట్‌లు, పలు నివాసాల్లో కెమెరాల ఏర్పాటుతో కొంత భద్రత చేకూరింది. కానీ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటైన కెమెరాల కన్ను మూతపడింది. నిరంతరాయం నిశితంగా గమనించే కెమెరాలు చాలాచోట్ల మరమ్మతులకు గురయ్యాయి. వాటిని పట్టించుకునే వారే లేరు. దీనితో పట్టణాల్లో మహిళల మెడలో గొలుసులు, వాహన చోరీలు యథాతథంగా మారాయి.

ఏలూరు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీసీ కెమెరాల పనితీరు ప్రశ్నార్థకంగా మారింది. నిర్వహణ, పర్యవేక్షణ ఒక ప్రైవేటు సంస్థకు అప్పగించారు. మరో 3 వేల కెమెరాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. కాగా నగరంలోని ప్రధాన కూడళ్లు, నగరంలో ప్రవేశించే మార్గాల్లో సుమారు 100 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని జిల్లా పోలీస్ కార్యాలయానికి అనుసంధానించారు. కెమెరాల ఆధారంతో అనేక కేసులను పోలీసులు ఛేదించగలిగారు. ఆందోళనలు, ఉద్యమాలు జరిగిన సమయంలో ఎంతమంది పాల్గొన్నారు, ఏ ప్రాంతంలో ఉన్నారు, వారు వెళ్లే మార్గాలను అంచనా వేసి పోలీసు బలగాలను ఆ ప్రాంతానికి పంపిస్తారు.

ఏలూరు నగరంలో రెండు ప్రధాన ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్లు ఉన్నాయి. ఫైర్‌స్టేషన్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే వాహన నెంబర్ ప్లేటు ఆధారంగా ఆటోమేటిక్‌గా ఫైన్ విధిస్తారు. అంబులెన్సులకు కూడా ఫైన్లు అనేకం విధించడం జరిగింది. ఏలూరు నగరంలో సీసీ కెమెరాల దెబ్బకు ఆటోవాలాలు అబ్బా అంటూ అధికారుల వద్దకు వెళ్లి గోడు వినిపించుకున్నారు. తమకు తెలియకుండానే ఒక్కొక్క ఆటోకు వేల రూపాయల జరిమానా పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫైర్‌స్టేషన్, పాత బస్టాండ్ సెంటర్లలో రెడ్‌సిగ్నల్ ఉండగా ఒక్క అడుగు వాహనం ముందుకు వెళ్లినా ఫైన్ కట్టి తీరాల్సిందే.

అభీష్టం మేరకే హెచ్‌ఎంలకు శిక్షణ తరగతులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో రెసిడెన్షియల్ పద్ధతిన విడతలవారీగా నిర్వహిస్తోన్న లీడర్‌షిప్ శిక్షణ తరగతుల్లో కీలకమార్పులు చేశారు. శిక్షణకు ఎంపికైన హెచ్‌ఎంలలో ఎవరికైనా రెసిడెన్షియల్ విధానంవద్దంటే వారి అభీష్టంమేరకు నాన్-రెసిడెన్షియల్ పద్ధతిని వర్తింపజేయాలని తాజాగా ఆదేశాలు వెలువడ్డాయి. అయితే నాన్-రెసిడెన్షియల్ విధానాన్ని ఎంచుకున్న హెచ్‌ఎంలు, టీచర్లు ఆయా ప్రాంతాల్లో రోజువారీగా నిర్దేశిత వేళకు ఖచ్చితంగా శిక్షణకు హాజరు కావాలి. అలాగే శిక్షణ కేంద్రాలను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఆ ప్రకారం జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం డివిజన్ల హెచ్‌ఎంలకు కొత్తగా భీమవరంలోని ఢిల్లీ పబ్లిక్‌స్కూలును శిక్షణ కేంద్రంగా ఎంపిక చేశారు. నూజివీడు డివిజన్ వారికి ఆగిరిపల్లిలో ప్రస్తుతం శిక్షణనిస్తోన్న హీల్ ప్యారడైజ్ స్కూలునే కొనసాగిస్తారు. ఈ నెల 9నుంచి నాల్గవ విడత, ఆ తదుపరి సోమవారం నుంచి చివరివిడత శిక్షణ తరగతులతో జిల్లాలోని హెచ్‌ఎంలందరికీ ట్రైనింగ్ క్లాసులు ముగుస్తాయి. కాగా లీడర్‌షిప్ ట్రైనింగ్‌కు హాజరైన హెచ్‌ఎంలలో ఇప్పటికే ఇద్దరు హెచ్‌ఎంలు శిక్షణకేంద్రాల్లోనే మృతి చెందిన సందర్భంలో నాన్-రెసిడెన్షియల్ పద్ధతిన జిల్లాకేంద్రంలోనే శిక్షణ తరగతులు నిర్వహించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్‌రాజు, జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర డిమాండ్ చేశారు. వీరికి నాన్-రెసిడెన్షియల్ పద్ధతిన శిక్షణకు అభీష్టాన్ని ఎంచుకునే వీలుకల్పించినప్పటికీ రోజూ వెళ్ళి రావడానికి అనుకూలంకాదని, అధికారులు పునరాలోచన చేయాలని కోరారు.

చేతి పంపునకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మునునూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం మహిళలు ఆందోళన..అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో శుక్రవారం వచ్చిన కథనానికి పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించారు. ఈవోపీ ఆర్డీ బి.ఎ.సత్యనారాయణ పర్యవేక్షణలో వేల్పుచర్ల గ్రామపంచాయితీ శివారు అన్నపనేనివారిగూడెం అడ్డ రోడ్డులో ఉన్న చేతిపంపుకు మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు.

ఆక్టోపస్ మాక్‌డ్రిల్

పోలవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో ఏపీ ఆక్టోపస్ పోలీసులు శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద దాడి జరిగినప్పుడు, అసాంఘిక శక్తులు విజృంభించినప్పుడు భద్రతా బలగాల సంసిద్ధతను పరీక్షించే లక్ష్యంతో జరిగిన ఈ కసరత్తు ఆక్టోపస్ సీనియర్ పోలీస్ అధికారుల పర్యవేక్షణలో జరిగింది. స్థానిక పోలీసులు, ప్రాజెక్ట్ భద్రతను పర్యవేక్షిస్తున్న ఎంఈఐఎల్ సిబ్బంది సహకారంతో ఈ డ్రిల్ నిర్వహించారు. పోలవరం ప్రాజెక్ట్ వంటి భారీ నిర్మాణాలను ఉగ్రవాదులు, అసాంఘిక శక్తులు లక్ష్యంగా చేసుకున్నప్పుడు స్పందించడంతో పాటు వారిని సమర్థంగా తమ శక్తిసామర్థ్యాలు, ఆయుధసంపత్తితో వ్యూహాత్మకంగా ఎలా ఎదుర్కొంటారో చూపారు.

బాబా సాహెబ్‌కు నివాళులు



గోపవరంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని



నూజివీడులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి

నూజివీడు/నూజివీడు టౌన్/ చాట్రాయి/ కలిదిండి/ముదినేపల్లి/ కైకలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకుని నూజివీడు శ్రీనివాసా సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పూలమాలవేసి నివాళులర్పించారు. జనసేన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి జనసేనపార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నాగబాబు, ఉమామహేశ్వరరావు, తోటా వెంకట్రావు, బొబ్బిలి శ్రీకాంత్, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ తాళం వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు నాగమణి తదితరులు పాల్గొన్నారు. నూజివీడు ఎమ్మార్‌అప్పారావు కాలేజ్ ఫర్ పీజీ స్టడీస్‌లో అంబేడ్కర్ చిత్ర పటానికి ఘనంగా ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారులు షేక్ అన్వర్‌బాషా, టి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. చనుబండ, సూరంపాలెంలలో అంబేడ్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. చనుబండలో అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ, టీడీపీ నాయకులు, సూరంపాలెం గౌడబజారు పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

కలిదిండిలో దళిత సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత సంఘాల నాయకులు కురేళ్ల ఏడుకొండలు, బళ్ల రాజు, దాసరి అబ్రహం లింకన్, జాన్ రాజ్, సుధాకర్, లేళ్ల సుబ్బారావు, ఈదా పద్మారావు పాల్గొన్నారు. మట్టగుంటలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు. ముదినేపల్లిలో దళిత సంఘాలు, మాలమహానాడు నాయకులు నిమ్మగడ్డ భిక్షాలు, భూపతి రవీంద్ర, మోట్రు ఏసుబాబు, బేతపూడి వెంకట రమణ, మొవ్వ ఫణీంద్ర, లేళ్ల ఆంజనేయులు తహసీల్దార్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ముదినేపల్లి సెంటర్‌లో తొలగించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉంచిన ఈ విగ్రహాన్ని పూర్వపు స్థానంలో ఏర్పాటు చేయడంలో జరుగుతున్న జాప్యంపై నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కైకలూరు మండలం గోపవరంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నూజివీడును సాఫ్ట్‌వేర్ హబ్‌గా తీర్చిదిద్దుతా: మంత్రి పార్థసారథి

నూజివీడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :నూజివీడును సాఫ్ట్‌వేర్ హబ్‌గా తీర్చిదిద్దుతానని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీలో పారాబోలా - 9 ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూజివీడు ట్రిపుల్‌ఐటీ ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన సాంకేతిక విద్యను అందిస్తూ సాఫ్ట్‌వేర్ నిపుణులుగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీని దేశంలో మొదటి టెక్నికల్ ఇనిస్టిట్యూట్‌గా తీర్చిదిద్దుతానని, తద్వారా నూజివీడు ప్రాంతాన్ని సాఫ్ట్‌వేర్ హబ్‌గా మార్చాలనే ఆలోచన ఉందన్నారు. ప్రస్తుతం 23మంది విద్యార్థులకు పారాబోలా సంస్థ ద్వారా ఇంటర్న్‌షిప్ రావడం అభినందనీయమన్నారు. ట్రిపుల్‌ఐటీ క్యాంపస్ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్ మాట్లాడుతూ క్యాంపస్‌లో స్టార్టప్ సెంటర్‌ను స్థాపించాలనే ఉద్దేశంతో అమెరికా ఆధారిత సంస్థ అయిన పారాబోలా 9తో అక్టోబర్‌లో సంతకం చేస్తుందని, ఈ సంస్థ నూజివీడు క్యాంపస్‌ను సందర్శించి ఇంజినీరింగ్ తృతీయ, చివరి సంవత్సరం విద్యార్థులు 15మందికి ఫుల్‌టైమ్ ఇంటర్న్‌షిప్ ఇవ్వడంతో పాటు ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 8మందికి పార్ట్‌టైమ్ ఇంటర్న్‌షిప్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్‌లో ఈ పారాబోలా కేంద్రాన్ని స్థాపించటానికి కావాల్సిన స్థలాన్ని కేటాయించటం జరిగిందన్నారు.

క్రికెట్ స్టేడియం నిర్మాణం చేస్తా

నూజివీడు ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు ఉపయుక్తమయ్యేలా క్రికెట్ స్టేడియంను నిర్మిస్తానని మంత్రి సారథి హామీ ఇచ్చారు. దీంతో పాటు ట్రిపుల్‌ఐటీ స్థాపన నుంచి డ్రెయినేజి వ్యవస్థ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించటం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. అలాగే ట్రిపుల్ ఐటీలో ఇతర సమస్యలు కూడా పరిష్కరిస్తామని అన్నారు.

నేడు మెగా పేరెంట్స్ టీచర్స్ డే సమావేశాలు

చాట్రాయి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ డే నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి అయ్యాయని ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు. ప్రతి గ్రామంలో ఉపాధ్యాయులు విద్యార్థులు ఇంటింటికి వెళ్ళి తల్లిదండ్రులను సమావేశానికి ఆహ్వానించారని అన్నారు.

ముసునూరు: రమణక్కపేట జడ్పీపాఠశాలలో శనివారం జరిగే మెగా పేరెంట్స్ డేకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు హెచ్‌ఎం పి.వి.ఎస్ రామకృష్ణారావు తెలిపారు. నేటికి సిద్ధం చేసిన ప్రోగ్రెస్ కార్డులు, బహుమతులను ఆయన శుక్రవారం పరిశీలించారు.

ముసునూరు: ముసునూరు జడ్పీపాఠశాలలో శనివారం జరిగే మెగా పేరెంట్స్ డే ఏర్పాట్లను నూజివీడు ఆర్డీవో వాణి శుక్రవారం పరిశీలించారు.



ఈ కార్యక్రమానికి రాష్ట్రగృహనిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న నేపథ్యంలో ఆర్డీవో ఏర్పాట్ల పైమండల విద్యాశాఖ అధికారి బి.వి.ఎస్ సుబ్బా రావుతో సమీక్షించారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రణాళిక ప్రకారం మెగా పేరెంట్స్‌డే జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో సూచించారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు సైతం ఈ కార్యక్రమానికి వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఈవోపీఆర్డీ బి.ఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటింటికి క్యాన్సర్ పరీక్షలు



చిన్నంపేటలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

చాట్రాయి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ధనిక పేద చిన్నా పెద్ద తేడా లేకుండా చాపకింద నీరులా విజృంభిస్తున్న క్యాన్సర్ మహమ్మారిని నిర్మూలించటానికి ప్రభుత్వం ఇంటింట పరీక్షలు చేపట్టింది. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్ళి 18 ఏళ్ళు పైబడిన వారికి పరీక్షలు చేస్తున్నారు. వైద్య సిబ్బంది ప్రత్యేక యాప్ డేటా ప్రకారం ప్రశ్నలు అడిగి నమోదు చేస్తున్నారు. సదరు వ్యక్తి బరువు, ఎత్తు, ఇప్పటికి గుర్తించిన అనారోగ్య సమస్యలు, ఆహార అలవాట్లు, ఇతర అలవాట్లు, నిత్యం ఏ ఆహారం ఎంత మేరకు తీసుకుంటున్నారు, ప్రస్తుతం వాడుతున్న మందులు మొదలైనవి అడిగి అడిగి నమోదు చేస్తున్నారు. వీటితో పాటు రక్తపోటు, మధుమేహం, హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్నారు. శరీర భాగాల్లో మచ్చలు,గడ్డలు ఉంటే పరీక్షిస్తున్నారు. సమస్య ఉంటే పీహెచ్‌సీకి సిఫార్సు చేస్తారు. పీహెచ్‌సీ డాక్టర్ పరీక్షించి అవసరమైతే పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేసి చికిత్స అందిస్తారు. గ్రామాల్లో రొమ్ము, గర్భాశం ముఖ ద్వార క్యాన్సర్ నివారణే ప్రధాన లక్ష్యంగా వైద్య శాఖ ఈ సర్వే చేపట్టింది. ఒక్కో ఇంటి వద్ద 30 నిమిషాలు పడుతుండగా రోజుకు 10 నుంచి 20 ఇళ్ళు సర్వే చేస్తున్నారు. ప్రతి గ్రామంలో ఏఎన్‌ఎం ఆధ్వర్యంలో టీం సర్వేచేస్తున్నారు.

తొలి దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారణ సాధ్యమే



ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను గుర్తించి, తొలి దశలో చికిత్స అందిస్తే నివారణ సాధ్యమే. 18 ఏళ్ళు దాటిన అందరూ పరీక్షలు చేయించుకోవాలి. ప్రజల చైతన్యం అవగాహనతో క్యాన్సర్‌ను పూర్తిగా నిర్మూలించవచ్చు. ఈ సర్వే పూర్తి కావటానికి 9 నెలలు పట్టవచ్చు

- డాక్టర్ విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యాధికారి, చాట్రాయి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందచేత

నూజివీడు టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు రూ.7,39,000 విలువచేసే చెక్కులను మంత్రి పార్థసారథి అందించారు. నూజివీడులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 15మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందించారు.

చిత్తపూరు, చీపురుగూడెంలో ఎక్సైజ్ దాడులు

చాట్రాయి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తపూరులో శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడి నిర్వహించి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, నిందితుడు బొలికొండ రమేష్‌ను అరెస్ట్ చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. చీపురుగూడెం గ్రామంలో తనగల నాగేశ్వరరావు వద్ద అర లీటరు సారా స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్ట్ చేశామని అన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల యోగా ప్రదర్శన

నూజివీడు టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):నూజివీడు ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల యోగశాల ప్రదర్శన మరోసారి మన్ననలు పొందింది. నూజివీడు ట్రిపుల్‌ఐటీని సందర్శించిన సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారథి ఎదుట నూజివీడు ట్రిపుల్ ఐటీ యోగశాల విద్యార్థులు తమ యోగా ప్రదర్శనను నిర్వహించారు. దీంతో ముగ్ధుడైన మంత్రి సారథి విద్యార్థులను అభినందించారు.

మహిళను కాపాడిన పోలీసులు

ఏలూరు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి) : అన్నవరానికి చెందిన వెంకటేష్ ఈనెల 5వ తేదీ రాత్రి 7.36 గంటలకు 112 కు కాల్ చేశాడు. తన భార్య బత్తుల త్రివేణి తనతో 5వ తేదీ మధ్యాహ్నం గొడవ పడి ఇంటి నుంచి వెళ్ళిపోయిందని రాత్రి వేళ ఏలూరు పాతబస్టాండ్ నుంచి తనకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుని చని పోతానని చెప్పిందని సమాచారం అందించాడు. దీంతో 112 కాల్ సెంటర్ వెంటనే ఏలూరు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వైవి రమణ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ వెంటనే ఏలూరు పాత బస్టాండ్ వద్దకు వెళ్ళి ఆమెను గుర్తించి స్టేషన్‌కు తీసుకువచ్చారు. పోలీసు అధికారులు ఆమెకు కౌన్సెలింగ్ చేసి బంధువులకు అప్పగించారు. సకాలంలో స్పందించి ఆమెను కాపాడిన పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎక్సైజ్‌శాఖ విస్తృత దాడులు

35 మద్యం సీసాలు స్వాధీనం..

ముగ్గురిపై కేసు నమోదు

కైకలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం బెల్టు షాపులు ఎక్కడైనా నిర్వహిస్తే ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందించాలని ఇలా సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎక్సైజ్ ఎస్‌ఐ పి.ఆదినారాయణ అన్నారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని శుక్రవారం కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి, మండవల్లి మండలాల్లో దాడులు నిర్వహించారు. ముదినేపల్లి మండలం కొత్తపల్లికి చెందిన ఆరేపల్లి కృష్ణ, మండవల్లి మండలం కొవ్వాడలంకకు చెందిన జయమంగళ రాఘవేంద్రరావు, ఇంగిలిపాకలంకకు చెందిన మోరు వెంకట శ్రీకాంత్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 35 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా మద్యం అక్రమంగా తరలించినా, బెల్టుషాపులు నిర్వహించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సంక్షేమం, అభివృద్ధి రెండింటికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే డాక్టర్ కామినేని

కైకలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధి రెండిటికి ప్రాధాన్యం ఇస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గోపవరంలో రూ.14లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వ నిధులు రూ.7.50 లక్షలు కాగా గ్రామానికి చెందిన ఇందుకూరి సత్యనారాయణ రాజు కుమారుడు వజ్రం రూ.6.50 లక్షలు సొంత నిధులతో భవన నిర్మాణాన్ని చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల ఆవరణాన్ని మెరక చేసేందుకు మరో దాత కనుమూరి పాండురంగరాజు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ ఉలిసి వసంతకుమారి, టీడీపీ నేతలు ఐసీడీఎస్ అధికారిణి దీప్తి, ఎంఈవో రామారావు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కలిదిండి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, కలిదిండి సర్పంచ్ మారుతి ప్రసన్న అన్నారు. పేట కలిదిండిలో వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో రూ.8.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు.





సింగరాయపాలెంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేస్తున్న అర్చకుడు



సింగరాయపాలెంలో బాధ్యతలు చేపట్టి పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

షష్ఠి ఉత్సవాలకు శ్రీకారం

పెండ్లి కుమారుడైన సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరుడు

ముదినేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక షష్ఠి కల్యాణోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్వామిని, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేసి పూజలు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి ఆధ్వర్యంలో అర్చకులు తోలేటి వీరభద్ర శర్మ, కోట శివశంకర శర్మ పూజలు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం విఘ్నేశ్వరపూజ, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ కార్యక్రమాలను జరిపారు. ఉత్సవాలకు నియమించిన ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయంలో పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా డీఎస్పీ శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో కైకలూరు సీఐలు రవికుమార్, కృష్ణ ఆధ్వర్యంలో సుమారు 70 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తు న్నట్టు ఎస్‌ఐ వి.ఎస్.వీరభద్రరావు తెలిపారు. పెదగొన్నూరులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, ముదినేపల్లిలోని పంచముఖ శివసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లోను షష్ఠి కల్యాణోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి.



ప్రత్యేక అలంకరణలో పెదలంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

● కలిదిండి : పెదలంకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఈవో శేఖర్ తెలిపారు. స్వామి దర్శనం కోసం భక్తులకు ప్రత్యేకంగా క్యూ లైన్లను ఏర్పాటు చేశామన్నారు. నాగేంద్రస్వామి పుట్ట వద్ద భక్తులు పూజలు చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. చలువ పందిళ్లు వేశామన్నారు. స్వామి దర్శనం అనంతరం భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

● మండవల్లి : మండవల్లిలో వల్లీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో షష్ఠి మహోత్సవాలు సందర్భంగా స్వామి గ్రామోత్సవాన్ని శుక్రవారం మండవల్లిలో నిర్వహించారు. భక్తుల సందర్శనార్థం గ్రామంలో స్వామి ఊరేగింపు నిర్వహించారు. స్వామివారికి భక్తులు హారతులు, కానుకలు సమర్పించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం షష్ఠి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరపనున్నట్టు తెలిపారు.